# శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర

135



మూలము

తాళ్ళపాక చినతిరువేంగళనాథుడు (చిన్నన్న)

వచన రచన

డాక్టర్ కేసర్లవాణి, ఎం.ఏ., పిహెచ్.డి.

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి.

1997

Dr V Krishnaveni

# శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర

మూలము

## తాళ్ళపాక చినతిరువేంగళనాథుడు (చిన్నన్న)

రచన

డాక్టర్ కేసర్ల వాణి, ఎమ్.ఏ., పిహెచ్.డి.,
రీసెర్చి అసిస్టెంట్, అన్నమాచార్య ప్రాజెక్ట్, తి.తి.దే.

సంపాదకులు

డాక్టర్ మేడసాని మోహన్, ఎమ్.ఏ., పిహెచ్.డి.,
డైరెక్టర్, అన్నమాచార్య ప్రాజెక్ట్, తి.తి.దే.

ప్రచురణ
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
1997

Sri Tallapaka Annamacharyula Jeevita Charitra.

By

Dr.K. Vani, M.A., Ph.d.,

© All Rights Reserved.

T.T.D. Religious Publications Series No. 372

First Edition : August, 1990
Second Edition: May : 1997

Copies : 5,000

Published by:
Sri M.K.R. Vinayak I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Printed at:
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati-517 507

# ముందుమాట

క్రీ.శ. 15 వ శతాబ్దంలో సంకీర్తనమనే భక్తిమార్గం ద్వారా శ్రీ వేంకటేశ్వరుని మహాత్మ్యాన్ని, తత్త్వాన్ని 32,000 అధ్యాత్మ, శృంగార పదాల్లో రచించి తరించిన మహాభాగవతోత్తముడు తాళ్లపాక అన్నమాచార్యులు.

రాగిరేకుల్లో భద్రపరచబడిన తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలను, తాళ్లపాక కవుల వాఙ్మయాన్ని ప్రచురించడానికి తొలి ప్రయత్నం తి.తి.దే.చే 1935 సం॥లో జరిగినది. మరియు తి.తి.దే.చే 1949 సం॥లో ప్రప్రథమంగా అన్నమాచార్య వర్ధంతి మహోత్సవాలు నిర్వహింపబడ్డాయి. వివిధ దశలలో కొనసాగుతున్న తాళ్లపాక కవుల వాఙ్మయ ప్రచురణ, అన్నమాచార్య సంకీర్తనల ప్రచారానికి తి.తి.దే. 1978 సం॥లో అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించింది. అప్పటి నుంచి అన్నమాచార్య సంకీర్తనలకు దేశవ్యాప్తంగా విశేష ప్రచారం, ఆదరణ ఏర్పడింది. పాఠక లోకంలో అన్నమాచార్య పదసాహిత్యంపై భక్తి పాదుకొన్నది. 'పద కవితా పితామహుడ'ని కీర్తి గడించిన తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనల అధ్యయనానికి, పరిశోధనకు విస్తారమైన అవకాశం కలిగింది. ఈ సందర్భంలో అన్నమాచార్యుల జీవిత చరిత్రను గురించి తెలుసుకోవాలనే ఆసక్తి పాఠకలోకంలో ఉన్నది. మన భాగ్యవిశేషం వల్ల అన్నమాచార్యుల జీవిత చరిత్రను వారి మనుమడు తాళ్లపాక చినతిరువేంగళనాథుడు (చిన్నన్న) ద్విపదకావ్యంగా రచించాడు. ఈ ద్విపద కావ్యాన్ని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పరిష్కరణతో విపుల పీఠికతో తి.తి.దే. 1949 సం॥లో ప్రచురించింది. మరల 1978 సం॥లో శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి పరిష్కరణతో వెలువడింది. అన్నమాచార్య వాఙ్మయ పరిశోధకురాలైన డా॥ కేసర్లవాణి వచన గ్రంథంగా సరళశైలిలో రచించిన అన్నమాచార్య జీవిత చరిత్రను 1990 సం॥లో ప్రాజెక్టు ప్రచురణగా తి.తి.దే. ముద్రించింది. పునర్ముద్రితమవుతున్న ఈ గ్రంథం మునుపటివలె అన్నమాచార్య సంగీత, సాహిత్యాభిమానుల మన్ననలు పొందగలదని మా ఆశంస.

ఇతనికంటె మరి దైవముఁగానము యెక్కడ వెదకిన నితఁడే
అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటికాధారముఁ దానె॥

[3 - 370]

తిరుపతి,
23-4-97.

ఎం.కె.ఆర్. వినాయక్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

# నివేదన

శ్రీ వేంకటేశ్వరస్వామివారి నందకాంశ సంభూతుడుగా క్రీ.శ.15 శ॥లో జన్మించిన మహాభక్తుడు తాళ్లపాక అన్నమాచార్యులు. వైష్ణవ తత్త్వాన్ని, ప్రాశస్త్యాన్ని 32,000 పదాల్లో రచించి హరికీర్తనాచార్యుడని కీర్తి గడించిన మహానుభావుడితడు. ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో పల్లవి, చరణాలతో కూడిన పదరచన కితడు మార్గదర్శకుడై 'పదకవితా పితామహుడ'ని వినుతికెక్కాడు.

అన్నమయ్య పదాలను వారి సంతతి వారే రాగిరేకులపై చెక్కించి తిరుమల ఆలయ ప్రాంగణంలో 'తాళ్లపాక అర'లో భద్రపరిచారు. కాలగర్భంలో కలసిపోగా మనకు లభించిన రాగిరేకులు మొత్తం 2,701. రాగిరేకులపై ఇంతటి విశాల సాహిత్యం లభించడం ప్రపంచ సాహిత్య చరిత్రలోనే అపూర్వమైన విషయం. గత 4 శతాబ్దాలకు పైగా తిరుమల ఆలయ ప్రాంగణంలో అసూర్యం పశ్యలుగా 'తాళ్లపాక అర' లో నున్న రాగిరేకులను 1922వ సం॥లో తిరుమల తిరుపతి దేవస్థానం వారు కనుగొన్నారు.

1935 సం॥ నుండి తిరుమల తిరుపతి దేవస్థానం వారు నేటి వరకు వివిధ దశలలో తాళ్లపాక అన్నమాచార్యుల, పెదతిరుమలాచార్యుల, చినతిరుమలాచార్యుల సంకీర్తనలను రాగిరేకుల నుండి పరిష్కరించి 32 సంపుటాలుగా వెలువరించింది. మరియు తాళ్లపాక కవుల వాఙ్మయాన్ని ప్రకటించింది.

తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనలు 1978 సం॥ నుండి తి.తి.దే. అన్నమాచార్య ప్రాజెక్ట్ ద్వారా భక్తలోకంలో విశేషవ్యాప్తిని పొందాయి. అందుకు అనుగుణంగా అన్నమాచార్య ప్రాజెక్ట్ ప్రచారం - పరిశోధన - ప్రచురణ విభాగాలతో తమ కార్యక్రమాలను నిర్వర్తిస్తున్నది.

నేడు పాఠకలోకంలో, భక్తలోకంలో అన్నమాచార్య సంకీర్తనలకున్న విశేష ప్రాశస్త్యాన్ని, ప్రాచుర్యాన్ని తి.తి.దే. గుర్తించి తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలను, వాఙ్మయాన్ని పునర్ముద్రించాలని సంకల్పించింది. ఇందులో భాగంగా తాళ్లపాక చిన తిరువేంగళనాథుడు రచించిన ద్విపదకృతి 'అన్నమాచార్య జీవిత చరిత్ర' 1990 సం॥లో వచన రూపంలో వెలువడింది. అన్నమాచార్య ప్రాజెక్ట్ పరిశోధకురాలైన డా॥ కేసర్ల వాణి ఎం.ఏ., పిహెచ్.డి. రచించిన ఈ పుస్తకం బహుజనామోదం పొందగలదని మా విశ్వాసం.

తిరువేంకటాచలాధిపుఁడు దానై యుండి
పరిపాలనము సేయ భారకుండితఁడు.

[1-170]

తిరుపతి,
29-4-97.

డా॥ మేడసాని మోహన్, ఎం.ఏ., పిహెచ్.డి.,
డైరెక్టర్,
అన్నమాచార్య ప్రాజెక్ట్, తి.తి.దే. తిరుపతి.

# కృతజ్ఞతలు

తిరుమల తిరుపతి దేవస్థానం పరమభాగవతోత్తముడైన తాళ్లపాక అన్నమాచార్యుల కీర్తనల ప్రచారానికి 1978 సం॥ అన్నమాచార్యప్రాజెక్టు స్థాపించింది. ఆనాటి నుండి అన్నమాచార్య సంకీర్తనలకు విశ్వవ్యాప్తమైన ప్రచారం ఏర్పడింది. అన్నమాచార్య సాహిత్య అధ్యయనం పట్ల పాఠక లోకంలో, పరిశోధకులలో ఆసక్తి పెరిగింది. అన్నమాచార్య సాహిత్యంపై వివిధ విశ్వవిద్యాలయాలలో పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా తి.తి.దే. వారు అన్నమాచార్య సంకీర్తనలను, తాళ్లపాక కవుల రచనలను పునః ప్రకటించాలని సంకల్పించారు.

తాళ్లపాక చినతిరుగవేంగళనాథుడు (చిన్నన్న) రచించిన 'అన్నమాచార్య జీవితచరిత్ర' ద్విపద కావ్యాన్ని 1949 సం॥లో కీ.శే. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు, 1978 సం॥లో కీ.శే. గౌరిపెద్దిరామసుబ్బశర్మగారలు పరిష్కరించగా తి.తి.దే. ప్రకటించింది.

1990 సం॥లో అన్నమాచార్య ప్రాజెక్టు పరిశోధనావిభాగం తరపున 'అన్నమాచార్య జీవిత చరిత్ర' ద్విపదను వచన గ్రంథంగా రూపొందించే అవకాశం నాకు కలిగింది.

1990 సం॥లో తి.తి.దే. ప్రకటించిన ఈ పుస్తకం ఈనాడు పునర్ముద్రింపబడుటకు అవకాశాన్ని కలిగించిన తి.తి.దే. యాజమాన్యానికి-

ఈ రచనకు ముందుమాట పొందుపరచిన తి.తి.దే. కార్యనిర్వాహకులు శ్రీ ఎం.కె.ఆర్. వినాయక్, ఐ.ఏ.ఎస్. గారికి-

"అన్నమాచార్య జీవిత చరిత్ర" ను వచన గ్రంథంగా వ్రాయుటకు ప్రోత్సహించిన అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డా॥ మేడసాని మోహన్ గారికి-

ఈ రచన ముద్రణకు ఆమోదాన్ని తెలిపిన తి.తి.దే. ధార్మిక పుస్తక ప్రచురణ సంఘానికి-

ముద్రణలో తమ సంపూర్ణ సహకారాన్ని అందించిన శ్రీ ముదివర్తి కొండమాచార్యులు గారికి-

సకాలంలో గ్రంథం ముద్రితమగుటకు తోడ్పడిన ప్రెస్ మేనేజర్ శ్రీ ఎం. లక్ష్మణరావుగారికి, వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

శ్రీ వేంకటగిరినాథుని చిత్తము లోపల నిలిపిన-
దేవసమానుఁడు నాతఁడె ధీరుఁడు నాతఁడె పో॥

[1-229]

డా॥ కేసర్లవాణి, ఎం.ఏ., పిహెచ్.డి.,
అన్నమాచార్య ప్రాజెక్ట్, తి.తి.దే.,
తిరుపతి.

యద్యద్విభూతి మత్సత్త్వం శ్రీమదూర్జిత మేవ వా,
తత్తదేవాఽవగచ్ఛ త్వం మమ తేజోంశ సంభవమ్.

[భగవద్గీత - విభూతియోగము-41 శ్లోకం]

విభూతి సంపన్నము, శ్రీమంతము, ఉత్సాహవంతము అయిన వస్తువు (ప్రాణి) ఏది కలదో, అది తన తేజోంశ సంభూతమైనదిగా తెలుసుకొమ్మని అర్జునునకు శ్రీకృష్ణపరమాత్మ ప్రబోధిస్తున్నాడు.



తాళ్లపాక అన్నమాచార్యులు
(1408 - 1503)

# శ్రీతాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర

విశ్వశ్రేయస్సుకోరే అధ్యాత్మచింతనకు నిలయం భరతభూమి. పరతత్త్వబోధనమే పరమావధిగా చేసుకొని ఎందరో మహానుభావులు ఈ కర్మభూమిపై అవతరించారు. పరమాత్మ తత్త్వాన్ని ప్రబోధించే మహానుభావుల ఉద్బోధలు నిత్యం ఈ వేదభూమిలో వినిపిస్తుంటాయి. కర్మ-భక్తి-జ్ఞానయోగాలనే మూడుమార్గాలు ఆధ్యాత్మిక క్షేత్రంలో సుప్రసిద్ధాలు. అందులోను భక్తిమార్గమే విశేషవ్యాప్తి పొందినది. మనజాతి జీవన ప్రవాహంలో భక్తిమార్గాన్ని నారదుడు, శాండిల్యుడు, వ్యాసుడు మొదలైన మహర్షులు ప్రబోధించారు. ఉత్తర భారతదేశంలో తులసీదాస్, కబీరు, మీరా, సూర్ దాస్, జయదేవుడు, లీలాశుకుడు భక్తితత్త్వాన్ని కావ్యాలుగా, గీతాలుగా రూపొందించిన ధన్యజీవులు.

దక్షిణభారతదేశంలో భక్తిమార్గాన్ని ప్రపత్తిరూపంలో ప్రబోధించినవారు భగవద్రామానుజులు. తమిళంలో వైష్ణవగీతాలకు నాలాయిర ప్రబంధాలని వ్యవహారం. పన్నిద్దరు ఆళ్వార్లు విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని పాశురాలుగా వెలయించారు. కన్నడంలో భాగవతధర్మాన్ని క్రీ.శ. 11వ శ॥ నుండి హరిదాసులు 'పదగళు' పేరుతో విశేషప్రచారంలోకి తెచ్చారు.

తెలుగులో శివకవులయుగంలో అంటే క్రీ.శ. 12 శ॥లో శైవ వాఙ్మయం పదములుగా వెలసినట్లు తెలుస్తున్నది. క్రీ.శ. 13 శ॥లో కృష్ణమాచార్యుని సింహగిరి నరహరి వచనములు ప్రసిద్ధికెక్కినాయి. తర్వాత యాగంటివారి పదాలు తత్త్వార్థబోధకాలైన రచనలుగా గుర్తింపుపొందాయి.

క్రీ.శ. 15 శ॥లో 'పదకవిత' క్రొత్త పుంతలు తొక్కింది.

నామ సంకీర్తనం యస్య
సర్వపాపప్రణాశనమ్

[భాగవతం-12-13-23]

సర్వపాపాలను కడిగివేయగల భగవన్నామ పరమార్థాన్ని విశాలపద సాహిత్యంలో వెలయించిన ధన్యజీవి తాళ్లపాక అన్నమాచార్యుడు.

అందమైన రామానుజాచార్య మతమును
అందుకొని నిలిచినాఁడన్నమయ్యా
విందువలె మాకును శ్రీవేంకటనాథుని నిచ్చె
అందరిలోఁదాళ్ళపాక అన్నమయ్యా

[16 సంపు-1భా-23 సంకీర్తన]

క్రీ.శ. 15వ శతాబ్దంలో శ్రీవేంకటేశ్వరాంకితంగా 32,000 పదాలను రచించి వైష్ణవమతాన్ని పునరుజ్జీవింపచేసిన చరితార్థుడు అన్నమయ్య. వీరిపదాలు ఈ నాటికీ ప్రతిచోటా విన్పిస్తుంటాయి.

భగవంతునియొక్క నామాన్ని, లీలలను, గుణగణాల్ని సంకీర్తన వాఙ్మయంలో పొందుపరచి ఆచంద్రతారార్కం తరిగిపోని కీర్తిని పొందిన అన్నమయ్య జీవితచరిత్ర ఎందరికో మార్గదర్శకం.

అన్నమాచార్య చరిత్ర రచనకు వీరి మనుమడు తాళ్ళపాక చినతిరు వేంగళనాథుడు రచించిన 'అన్నమాచార్య చరిత్ర' ఆధారం. ఇది ద్విపద కావ్యం. ఇతడు పెదతిరుమలాచార్యుని నాలుగో కుమారుడు. 'చిన్నన్న' అని వ్యవహార నామం. తాతగారి జీవితచరిత్రను ప్రామాణికంగా రచించినవాడు. తెలుగు వాఙ్మయంలో ద్విపద ప్రక్రియకు కావ్యత్వసిద్ధి కల్పించినవాడు. తాత గారి జీవిత చరిత్రనే కాక పరమయోగి విలాసము, అష్టమహిషీకళ్యాణము, ఉషాపరిణయము అనే ద్విపదకావ్యాలను రచించాడు. ఇతడు ద్విపదకావ్య రచనలో దిట్టగా తెనాలి రామకృష్ణునిచే-

"చిన్నన్న ద్విపద కెఱఁగును
పన్నుగఁబెద తిరుమలయ్య పదమున కెఱఁగున్"

(అప్పకవీయం-3-2-25)

అని కీర్తించబడినవాడు.

తెలుగు వాఙ్మయచరిత్రలో కవులచరిత్రను గ్రంథస్థం చేయడం అంతగా అలవాటులేదు. తెలుగు సాహిత్యచరిత్రలో ప్రసిద్ధులైన తిక్కనగూర్చి కేతన,

శ్రీనాథునిగూర్చి దగ్గుపల్లి దుగ్గన, రాధా మాధవకవి, పండితారాధ్యులగూర్చి సోమనాథుడు పేర్కొన్నట్లు వారిగ్రంథాల ఆధారంతో వెల్లడి అవుతున్నది. కొందరుకవులు కావ్యాలలో 'కృతికర్తృవంశం' అనే శీర్షికలో తమ వంశచరిత్రను సంగ్రహంగా చెప్పివున్నారు.

తాళ్ళపాకవంశ ఖ్యాతికి మూలపురుషుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు. హరికీర్తనాచార్యుడు, పదకవితా పితామహుడు, పంచమాగమ సార్వభౌమ బిరుదాంకితుడతడు. 'అన్నమాచార్యచరిత్ర'ను అన్నమయ్య మనుమడైన చిన్నన్న రచించినది కాబట్టి చారిత్రక, సాహిత్యపు విలువలుగల ప్రామాణిక గ్రంథమని చెప్పవచ్చును. తన వారే తనకథ వ్రాయునంతటి చరిత్ర, ప్రశస్తి గలవాడు అన్నమయ్య. కవి జీవితాన్ని ఇతివృత్తంగా స్వీకరించి జీవితచరిత్రను రచించిన తొలితెలుగుకవి కూడా తాళ్ళపాక వంశీయుడే కావడం విశేషం.

'అన్నమాచార్య చరిత్ర' ద్విపద వ్రాతప్రతిని కడపజిల్లా రాయచోటి తాలుకా మడితాడు గ్రామవాసి శ్రీతాళ్ళపాక సూర్య నారాయణయ్యగారు పాత తాటాకు ప్రతిని అనుసరించి క్రీ.శ. 1940 సంవత్సరంలో వ్రాసినారట. వీరు వ్రాతప్రతిని తిరుపతి శ్రీవేంకటేశ్వర ప్రాచ్యగ్రంథాలయానికి (O.R.I.) అందచేశారు. కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తాళ్ళపాక సూర్య నారాయణయ్యగారు అందించిన ద్విపద వ్రాతప్రతిని పరిష్కరించి క్రీ.శ. 1949 సంవత్సరములో దేవస్థానం తరపున విపులపీఠికతో ముద్రించారు. తదుపరి క్రీ.శ. 1966లో పీఠిక మాత్రమే ద్వితీయ ముద్రణగా వెలువడింది. మరల క్రీ.శ. 1978 సంవత్సరంలో తాళ్ళపాక వాఙ్మయ పరిష్కర్తలైన శ్రీగౌరి పెద్ది రామసుబ్బశర్మగారి పరిష్కరణతో మూడోముద్రణను దేవస్థానంవారు వెలువరించారు.

ఈ ద్విపదకావ్యంలో అన్నమాచార్యుని పూర్వులనుండి అన్నమయ్య జననం, జీవితవృత్తాంతాలు, అన్నమయ్య పుత్రపౌత్రాదుల వివరాలు, వారి రచనల వివరాలు పేర్కొనబడ్డాయి.

ప్రస్తుత రచనలో 'అన్నమాచార్యచరిత్ర' ద్విపద, సంకీర్తనల ఆధారంగా క్రమానుగతంగా వివరించబడుతుంది.

## తాళ్లపాక :

పొత్తపినాడు మండలం నడిబొడ్డున తాళ్ళపాక గ్రామం విరాజిల్లుతుండేది. ఆ గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి కరుణాకటాక్షములతో ఆ గ్రామజనులు సుఖవంతులై జీవనం సాగించేవారు. ఇచ్చటి చెన్నకేశవస్వామి విగ్రహాన్ని జనమేజయుడు ప్రతిష్ఠించాడని కథనం. సస్యశ్యామలమై విరాజిల్లే ఈ గ్రామం సన్మునులకు, అఖిల దేవతలకు నిజవాసమై వుండేదని అంటారు స్థలజ్ఞులు. ఆ గ్రామవాసులు-

కనుట గోవిందు మంగళ విగ్రహంబె
వినుట నారాయణ వృత్తాంతచయమె
చేయుట కౌస్తుభాంచిత పూజె తలఁపు
పేయుట మాధవు శ్రీపాదయుగమె
కుడుచుట వనమాలిగొను ప్రసాదంబె
నడచుట నంద నందను నగరికినె
కావి, దుర్విషయ పంగతి కలలోన

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-4)

తలపక, ఇందిరారమణపదైక మానసులుగా జీవనం గడిపేవారు.

ఇంతటి మహోన్నత భగవత్ప్రసాదితమైన ఆత్మసంస్కారంతో ప్రకాశించే తాళ్ళపాక గ్రామంలో అన్నమయ్య జన్మించాడు. అన్నమయ్య నందవరవైదిక బ్రాహ్మణవంశస్థుడు. ఋగ్వేదులు, ఆశ్వలాయనసూత్రులు, భారద్వాజస గోత్రులు అయిన నారాయణసూరి లక్కమాంబా దంపతులకు శ్రీవేంకటేశ్వరుని వరప్రసాదిగా జన్మించాడు అన్నమయ్య.

## నందవరీకులగాథ:

నందవరీకులు క్రీ.శ. 10వ శతాబ్దంలో కాశినుండి ఆంధ్రదేశానికి వలసవచ్చిన శుద్ధవైదిక బ్రాహ్మణులని పరంపరాయత ప్రతీతి. క్రీ.శ. 10వ శతాబ్దంలో నేటి కర్నూలు జిల్లాలోని నందవరం అనే గ్రామాన్ని నందుడనే రాజు పాలించేవాడు. ఈ రాజు కాశీయాత్రకు వెళ్ళినపుడు అక్కడ కొందరు

వైదిక బ్రాహ్మణులు చాముండేశ్వరీ ఉపాసకులు పరిచయం అయ్యారనీ, ఆ సమయంలో వారణాసిలో క్షామం రాగా ఆ బ్రాహ్మణ కుటుంబాలు కొన్ని ఆంధ్రదేశానికి వలసవచ్చి నందరాజు ఆశ్రయంలో స్థిరపడ్డారని, నందరాజుచే తీసుకొనిరాబడిన వైదికులు కావడంచే నందవైదికులు అనీ, నందవరంలో నెలకొన్నవారు కావడంచే నందవరీకులుగా ప్రచారం పొందారని జనవాక్యం. కాలక్రమాన వీరు నేటి కర్నూలు, కడపజిల్లాలలో స్థిరపడ్డారని పరిశోధకుల అభిప్రాయం. తాళ్ళపాక గ్రామనామం అన్నమయ్య వంశస్థులకు ఇంటిపేరుగా నిలిచినది.

## అన్నమయ్య వంశీకులు:

భారద్వాజ గోత్రులైన అన్నమయ్య పూర్వుల ప్రస్తావన, నాలుగు తరాలకు సంబంధించిన వివరాలను చిన్నన్న అన్నమాచార్య ద్విపద వల్లను, అష్టమహిషీ కళ్యాణం వల్లను గ్రహించవచ్చును.

భరద్వాజ ఋషి

↓

నారాయణయ్య

↓

విఠలయ్య

↓

నారాయణయ్య

↓

విఠలుడు

↓

నారాయణుడు

↓

నారాయణసూరి

↓

అన్నమాచార్య

(అన్న. చరిత్ర. ద్విపద-పుట-5)

అన్నమయ్య పితృ పితామహులు నారాయణయ్య, విఠలయ్యలు విష్ణు పదభక్తిరతులై తాళ్ళపాకచెన్నకేశవస్వామిని సేవించుకొంటూ జీవితం గడిపేవారు.

అన్నమయ్యకు ముందు నాలుగోతరంలో జన్మించిన నారాయణయ్య కథతో అన్నమాచార్య చరిత్ర ప్రారంభం అవుతుంది.

నారాయణయ్యకు చిన్నతనంలో చదువుసంధ్యలు అబ్బలేదు. తండ్రి విఠలయ్య తనవద్ద ప్రయోజనంలేదని పక్కనే ఊటుకూరులో తన బంధువుల వద్ద ఉంచాడు. ఊటుకూరు నేడు కడపజిల్లా రాజంపేట తాలూకాలో ఉన్నది. అన్నమయ్య మనుమడు చినతిరుమలయ్య ఊటుకూరి చెన్నరాయుని మీద కొన్ని పంకీర్తనలు కూడ రచించాడు. ఊటుకూరునందు గురువులు నారాయణయ్యను-

సామదానే భేదదండా విత్యుపాయాశ్చతుష్టయమ్.

(అమరకోశం 2-8-81)

అన్నట్లు చతుర్విధ ఉపాయాలకు గురి చేశారు. అయినా బాలునికి చదువుపట్ల శ్రద్ధకలుగలేదు. చివరకు గురువు

"మాఱుమాటలు చెప్పి మలిపెట్టి చెక్కు
మాటిపోసినఁగాని మడుగు నోరికివి
రాకున్న విదియెట్టురా గొంటు వీవి
పోకలఁజూడ వబ్బురమయ్యె వాకు
నని యొక్కనాఁడు"-

(అన్న. చరిత్ర. ద్విపద-పుట-5)

నారాయణయ్యను కోదండమున వ్రేలాడదీశారు. కోల గగ్గెర విధించారు. గుంజిళ్ళు తీయించారు. కోదండం అంటే దూలానికి తాడు కట్టి వ్రేలాడ తీయడం. కోలగగ్గెర అంటే కాళ్ళుచేర్చికట్టి పసరమును కూలద్రోయునట్లుగా కూలద్రోయడం. నారాయణయ్యను అయ్యవార్లు ఇంతటి కఠిన పరీక్షలకు గురిచేసినా-

"ఈలాగు గావింప నెదురు మాటాడఁ
జాలక కన్నీరు జార"

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-6)

బాలుడు అవమానంతో క్రుంగిపోయాడు. లేతమనస్సు గాయపడింది. నారాయణయ్య ఊటుకూరు గ్రామశక్తి అయిన చింతలమ్మగుడి సమీపాన పుట్టలో పాముందని మునుపే వినివున్నాడు.

కలవనీ నా బాధకంటె నా పాము
కలచిన వెగులెల్లఁగడఁకేఁగు ననుచు

(అన్న. చరిత్ర. ద్విపద.పుట-6)

అని తలపోసి పుట్టలో చెయ్యి పెట్టాడు. నేడు ఊటుకూరునందు చింతలమ్మ ఆలయం కన్పించదు. కాని ఊటుకూరు శివాలయంలో ఒకగదిలో వున్న స్త్రీమూర్తి విగ్రహం 'చింతలమ్మ' అని స్థానికుల అభిప్రాయం.

బాలుడైన నారాయణయ్యకు త్రికాల వేదినియైన చింతలమ్మ ప్రత్యక్షమై ఓదార్చింది. సకలవిద్యలు తాళ్ళపాకలో వెలసియున్న చెన్నకేశవుని అనుగ్రహంవల్ల పొందగలవనియు,

'అదియును గాక మూడవ తరంబునను
వదలని కీర్తి మీ వంశంబునందు
పరమభాగవతుఁడు ప్రభవించు శౌరి
వరమున'.... .... ....

(అన్న. చరిత్ర. ద్విపద-పుట-7)

అని నారాయణయ్యను అనుగ్రహించి అంతర్ధానమైనది. అమ్మవారి ఆదేశం ప్రకారం నారాయణయ్య తాళ్ళపాకచేరి ఆశ్రితక్లేశనాశకుడైన చెన్న కేశవస్వామిని సేవించి స్వామి అనుగ్రహంచే వేదవేదాంగపారంగతుడై సకలవిద్యలు పొందగలుగుతాడు. సర్వజ్ఞుడని కీర్తి పొందుతాడు.

నారాయణయ్య కుమారుడు నారాయణసూరి. ఇతడు సకల విద్యాధురంధరుడుగా ప్రసిద్ధికెక్కినవాడు. వీరి ధర్మపత్ని లక్కమాంబ. ఈమె మాడుపూరు మాధవస్వామి భక్తురాలు.

మాడుపూరను నూర మాధవమూర్తి
తోడునీడై యాపెతో మాటలాడు

(అన్న. చరిత్ర. ద్విపద.పుట-8)

మాడుపూరు కడపజిల్లా సిద్ధవటం తాలూకాలో ఉన్నది. అన్నమయ్య తండ్రి పేరు 'నారాయణసూరి'గా చిన్నన్న పేర్కొనడాన్నిబట్టి తాళ్ళపాకవారు అన్నమయ్య జననానికి ముందే పండితవంశస్థులుగా కీర్తించబడేవారని భావించవచ్చును.

## తిరుమల పయనం-అన్నమయ్య జననం:

భాగవతసేవాపరాయణులైన నారాయణసూరి, లక్కమాంబలకు సంతానం లేకపోవడంచే తీవ్రవ్యధకు గురై-

ఆ లక్కమాంబతో నా సూరివరుఁడు
మేలిసంపదల నర్మిలిఁదెప్పదేలి
కటకట వేవురు గలుగంగనేమి
కొడు కొక్కరుండైనఁగుల ముద్ధరించు
తనయుండు గల్గిన తన పుట్టులెల్ల
ననయంబు సఫలమౌనని యిటువంటి
తనయులు లేమి నెంతయుఁజింతనొంది

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-9)

సర్వజనుల అభీష్టాలను నెరవేర్చే వేంకటేశ్వరుని సేవింపగోరి కొండకు ప్రయాణమయ్యారు. తిరుమలచేరి స్వామిమందిరం ప్రవేశించి గరుడ కంబం వద్ద సాగిలిమ్రొక్కారు. స్వామి వారికి తన నిజఖడ్గమైన నందకాన్ని కలలో ప్రసాదించాడు. నందకాంశతో తమకు పుత్రోదయమవుతుందని నారాయణ సూరి, లక్కమాంబలు తెలుసుకొంటారు. పరమానంద భరితులై ఆ పుణ్యదంపతులు తాళ్ళపాక చేరుతారు.

స్వామి అనుగ్రహంచే--

'రాజీవ నయను వరప్రసాదమునఁ
దేజంబు మతియు నెంతే విస్తరిల్ల
లక్కమాంబకుఁబుణ్యలావణ్యనిధికి
చక్కని గ్రహము లుచ్చముల మూఁడలర
అమపమ లగ్నంబునందు వైశాఖ
ముల విశాఖము జగంబుల మల్లపిల్ల
జనియించె నన్నమాచార్యుండు'

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-9)

నారాయణసూరి, లక్కమాంబలకు నందకాంశమున పుత్రోదయమైనది. నారాయణసూరి ఆ శిశువునకు ఆగమోక్తంగా జాతకర్మ చేశాడు.

'అన్నం బ్రహ్మేతి వ్యజానాత్' అనే శ్రుతి ప్రకారం నారాయణసూరి పరబ్రహ్మవాచకంగా తన పుత్రునకు అన్నమయ్య అని నామకరణం చేశాడు. అన్నమయ్యకు అన్నమయ్యంగారు, అన్నమాచార్యులు, అన్నయగురు, అన్నయార్య, కోనేటి అన్నమయ్యంగారు అనే నామాంతరాలు తాళ్ళపాక సాహిత్యంలోను, శాసనాల్లోను కన్పిస్తాయి.

శ్రీమహావిష్ణువు వక్షస్థలమందలి కౌస్తుభమే శఠకోపయతిగా, వేంకటేశ్వరస్వామి గుడిఘంట వేదాంతదేశికులుగా, స్వామి హస్తమందలి నందకమనే ఖడ్గాంశలో పేయాళ్వారులు, అన్నమయ్యలు అవతరించారని ప్రాజ్ఞుల విశ్వాసం.

## అన్నమయ్య జనన కాలం గూర్చిన చర్చ:

అన్నమయ్య జననకాలాన్ని గూర్చి సాహితీ పరిశోధకుల్లో ప్రధానంగా రెండు అభిప్రాయాలు కన్పిస్తాయి.

అన్నమయ్య జనన సంవత్సరం 1) క్రీ.శ. 1408 అనీ;

2) క్రీ.శ. 1424 అనీ;

పై రెండు అభిప్రాయాలను పరిశీలిద్దాం. అన్నమయ్య జననకాలం చర్చించడానికి ప్రధాన ఆధారాలు.

1. అన్నమయ్య జనన కాలాన్ని వివరిస్తూ తాళ్ళపాక చిన్నన్న

.......వైశాఖ
మున విశాఖను జగంబున మల్లపిల్ల
జనియించె నన్నమాచార్యుండు'

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-9)

అని మాస నక్షత్రాదులనే పేర్కొన్నాడు. ఇందులో సంవత్సరం పేర్కొన బడలేదు.

2. సంకీర్తనల రాగిరేకులమీది పాఠం:

అన్నమాచార్య సంకీర్తనల రాగిరేకుమీద ఈక్రింది వాక్యాలు మలచ బడ్డాయి :

"స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శక వరుషంబులు 1346 అగు నేటి క్రోధి సంవత్సరమందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదారుయేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను అది మొదలుగాను శాలివాహన శకవరుషంబులు 1424 అగునేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ 12 నిరుధానకు తిరువేంగళనాథుని మీదను అంకితము గాను తాళ్ళపాక అన్నమాచార్యులు విన్నపముచేసిన అధ్యాత్మ శృంగార సంకీర్తనలు."

పైన ఉదహరించిన రాగిరేకు మీది వ్రాతను బట్టి అన్నమయ్య నిర్యాణం శాలివాహన శకం 1424 [క్రీ.శ. 1503] అనగా దుందుభి ఫాల్గుణ బహుళద్వాదశి అని సంవత్సర, మాస, తిథి నామాలతో స్పష్టంగా తెలుస్తున్నది.

ఇక '1346' క్రోధి అన్నది అన్నమయ్య జననమా? వేంకటేశ్వరుని సాక్షాత్కారమా? అన్నది వివిధ అభిప్రాయాలకు అవకాశమిస్తున్నది.

రాగిరేకులమీది వ్రాత ప్రధానోద్దేశం అన్నమయ్య సంకీర్తన రచనా ప్రారంభ పరిసమాప్తాలను తెలపడమేకాని అన్నమయ్య జనన మరణాలగూర్చి తెలపడంకాదు. ఈ సందర్భంలో పెదతిరుమలయ్య సంకీర్తనల తొలి రాగిరేకులోని వాక్యాలుకూడ పేర్కొన దగియున్నవి.

'శాలివాహనశక వరుషంబులు 1424 అగు నేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ 12 మొదలుగాను తాళ్ళపాక అన్నమాచార్యులుంగారు తమ కొమారుడు తిరుమలాచార్యులను దినమొక సంకీర్తన శ్రీవేంకటేశ్వరునకు అంకితంచేసి చెప్పుమనఁగాను విన్నపము చేసిన సంకీర్తనలు' [అన్నమాచార్యులు పరమపదించిన నాటినుండి పెదతిరుమలాచార్యులు చెప్పిన కీర్తనలు.]

పై రాగిరేకుల మాటలు పెదతిరుమలాచార్యుల సంకీర్తనల రచనా ప్రారంభాన్నే స్పష్టం చేస్తున్నాయి. ఈ దృష్టితో పరిశీలిస్తే అన్నమాచార్యులు శాలివాహనశకం 1330 సర్వధారినామ సంవత్సరం వైశాఖమాసం విశాఖ నక్షత్రయుక్త పూర్ణిమా తిథిని [9-5-1408] జన్మించాడని చెప్పవచ్చును. ఈ లెక్క ప్రకారమే తిరుమల తిరుపతి దేవస్థానంవారు అన్నమాచార్య జయంతి ఉత్సవాలను 1978 నుండి వైభవంగా నిర్వహిస్తున్నారు.

అన్నమాచార్య సాహితీ పరిశోధకులైన శ్రీయుతులు సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి, చాగంటి శేషయ్య, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, ఆచార్య జి.ఎన్.రెడ్డి, కామిశెట్టి శ్రీనివాసులుశెట్టి, డా॥ ఎస్. గంగప్పగారలు చిన్నన్న ద్విపదను, రాగిరేకుల వ్రాతప్రతిని అనుసరించి అన్నమయ్య జననకాలాన్ని క్రీ.శ. 1408 సంవత్సరంగానే నిర్ణయించారు.

తాళ్ళపాక కవుల రచనలను, సారస్వత సేవను లోకవిదితం చేసిన కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు క్రీ.శ. 1945 సం॥లో వేంకటేశ్వర వచనాలకు పీఠిక వ్రాస్తూ అన్నమయ్య జననం క్రీ.శ. 1408గానే నిర్ణయించారు. కాని క్రీ.శ. 1949 సం॥లో 'అన్నమాచార్య చరిత్ర' ద్విపద కావ్యానికి పీఠిక వ్రాస్తూ అన్నమయ్య క్రీ.శ. 1424 నుండి క్రీ.శ. 1503 దాకా జీవించినట్లు పేర్కొన్నారు. వీరి కుమారులు డా॥ వేటూరి ఆనందమూర్తిగారు 'తాళ్ళపాకకవుల కృతులు-వివిధసాహితీ ప్రక్రియలు' [1975 సం॥] అనే గ్రంథంలో అన్నమయ్య జీవితకాలాన్ని క్రీ.శ. 1424-1503 గానే నిర్ణయించారు.

అన్నమయ్య, పెదతిరుమలయ్యల రాగిరేకులమీది వ్రాతను బట్టి, పరిశీలకుల భావసరణిని బట్టి

అన్నమయ్య జననకాలం - శా.శకం 1330, క్రీ.శ. 1408

సంకీర్తనల రచనా ప్రారంభకాలం - శా.శకం 1346, క్రీ.శ. 1424

అన్నమయ్య నిర్యాణం - శా.శకం1424, క్రీ.శ.1503 అని నిర్ణయించ వచ్చును.

## అన్నమయ్య బాల్యం:

హరి నందకాంశజుం డగుట డెందమున
పరమ సుజ్ఞాన సంపద పొదలంగ

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-10)

పసిబిడ్డడైన అన్నమయ్య వెంకన్న ప్రసాదమని చెబితేనే ఉగ్గుపాలు త్రాగేవాడు. వేంకటపతికి మొక్కుమని చెబితేనే మొక్కేవాడు. వేంకట పతిమీద జోలపాడనిదే నిద్రపోడు. లక్కమాంబ భక్తిగీతాలు పాడుతుంటే పరవశించి పోయేవాడు. ఇలా అన్నమయ్య శిశుప్రాయంనుండి వేంకటపతి మీది ధ్యాసతో ప్రొద్దులు గడపేవాడు.

అన్నమయ్యకు ఐదు సంవత్సరాలు నిండాయి. నారాయణసూరి ఆర్యుల సమ్మతిని అన్నమయ్యకు ఉపనయనం చేయించాడు.

'..... అహినాయకాద్రి
వెన్నుని వరముచే విద్య లన్నియును
నమితంబు లగుచు జిహ్వారంగసీమ
తముఁదామె పొచ్చి నర్తనమాడఁదొడఁగె'

(అన్న. చరిత్ర. ద్విపద-పుట-11)

అన్నమయ్య ఆడినమాటెల్లా అమృతకావ్యంగా, పాడినదెల్లా పరమ గానంగా భాసించేది. చిన్ననాటనే వేంకటపతి మీద వింత వింతలుగా సంకీర్తనలు ఆలపించేవాడు. కాని అన్నమయ్య సంకీర్తన రచనకు స్వామి

ఆదేశం పొందినది తన పదహారవ సంవత్సరంలోనే! వేంకటేశ్వరస్వామి ఆదేశం ప్రకారం అన్నమయ్య తన పదహారో ఏటనుండి రోజుకొక్క సంకీర్తనకు తక్కువకాకుండా వ్రాయడం ప్రారంభించాడు. ఈ విషయం రాగిరేకులమీద తొలివాక్యాలవల్ల కూడా స్పష్టమవుతున్నది.

అన్నమయ్య బాల్యంలో తల్లిదండ్రులు, వదినె చెప్పినపనులు అన్నీ విసుగుచెందక చేసేవాడు. ఉమ్మడి కుటుంబాల్లో పనులు తప్పవు. అందుకనే ఎప్పుడూ దండె భుజాన తగిలించుకొని పాటలు పాడడం ఇంటివారలకు అంతగా నచ్చేదికాదు. ఒకనాడు అందరూ కలసి పశువులకు గడ్డితెమ్మని అన్నమయ్యను అడవికి పంపారు. అన్నమయ్య అడవికి వెళ్ళి పచ్చనిగడికను చూశాడు.

'పాపవల్లరుల శ్రీపతివామహేతి
వే పారఁదఱుఁగు యోగీంద్రు చందమున'

(అన్న.చరిత్ర.ద్విపద.పుట-12)

కొంత పచ్చికను కోసాడు. పచ్చికకోస్తున్నా మనసంతా శ్రీహరి మీదనే వున్నది. అందుకే మరికొంత పచ్చికకోయబోయిన అన్నమయ్యకు కడవ్రేలు తెగి రక్తం కారింది. వేదనలో విరక్తి, భక్తి జనించాయి. వేదనలో వేదం ప్రభవించినట్లు ఈ సంఘటన అన్నమయ్య జీవితంలో భక్తిరసావేశానికి నాంది పలికింది. లౌకికబంధాలపై మమకారం వీడిపోయి-

అయ్యో పోయఁబ్రాయముఁగాలము
ముయ్యంచు మనసున నే మోహమతినైతి॥
తగు బంధులా తనకుఁదల్లులునుఁదండ్రులును
వగలఁబెట్టుచుఁదిరుగువారేకాక
మిగుల వీరల పొందు మేలనుచు హరినాత్మఁ
దగిలించలేక చింతాపరుఁడనైతి॥

(సంపుటం-1 సంకీ-179)

అని చింతించి-

తల్లియుఁదండ్రియు దైవంబు గురువు
నెల్ల సంపదలునై యెల్ల చందముల
నను(బ్రోచు శేషాద్రినాథుని, గొలిచి
మనియెద ... ... ... ...

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-12)

అని నిర్ణయించుకొంటాడు.

## తిరుమల పయనం:

ఆ సమయాన అన్నమయ్య తిరుమలకువెళ్ళే యాత్రికుల గుంపును చూశాడు. చేతిలో వున్న కొడవలిని పాఱవేసి యాత్రికులగుంపులో కలసి పోయాడు. ఆ యాత్రికులు సనకాదులనే భక్తబృందం. వారు జింకచర్మపు కిరీటాలు పెట్టుకొన్నారు. కాకి బంగారు, పాఱుటాకుల బట్టలు ధరించారు. ఫాలతలమున దట్టమైన పట్టెనామాలు, శంఖ చక్రముద్రికలు, కాళ్ళకు కంచుటందెలు పెట్టుకొన్నారు. దండెలు మీటుకొంటూ చిటితాళాలు వాయిస్తూ భక్తిపారవశ్యంతో-

వేడుకొందామా వెంకటగిరి వేంకటేశ్వరుని॥

ఆమటి మ్రొక్కులవాఁడే ఆదిదేవుఁడే వాఁడు
తోమని పళ్యాలవాడే దురితదూరుఁడే॥

వడ్డికాసులవాఁడే వనజనాభుఁడే పుట్టు
గొడ్డురాండ్రకు బిడ్డలనిచ్చే గోవిందుఁడే॥

ఎలమిఁగోరిన వరాలిచ్చే దేవుఁడే వాఁడు
అలమేల్మంగా శ్రీవేంకటాద్రినాథుఁడే॥

(అన్న. చరిత్ర.పీఠిక-పుట-6)

అని చిత్రగతుల పాడుకొంటూ కొండకు పయనమవుతున్న యాత్రికులతో కలసి తిరుపతి చేరుతాడు అన్నమయ్య.

తిరుపతి పొలిమేరలోకల గ్రామశక్తి తాళ్ళపాక గంగమ్మను సేవించాడు. ఈ తాళ్ళపాక గంగమ్మ ప్రాచీనదేవత అని స్థానికుల అభిప్రాయం. తిరుపతిలో ఇంకా తాతాయగుంట గంగమ్మ, అంకాళమ్మ, వేశాలమ్మ, కాళెమ్మ, నేరేళ్ళమ్మ, కావమ్మ, మారలయ్య అనే గ్రామశక్తులు కొలువై వున్నారు. పూర్వం తిరుపతికి వచ్చే భక్తబృందం మొదట తాళ్ళపాక గంగమ్మను సేవించిన తరువాతనే తిరుమలను సందర్శించే ఆచారం వుండేది. నేటికీ తిరుపతిలో మేనెలలో గ్రామశక్తి గంగమ్మజాతర వైభవోపేతంగా జరుగుతుంది.

గంగమ్మను దర్శించిన అనంతరం అన్నమయ్య-

'అదె చూడు తిరువేంకటాద్రి నాలుగు యుగము
లందు వెలుగొందె ప్రభమీరఁగాను'

(సంపు-1-పంకీ-227)

అని 108 తిరుపతులను కీర్తిస్తూ అచ్చటి చక్రవర్తి పీఠాలు, దేశాంత్రుల మఠాలు, తపస్వుల గృహాలు, విశ్రాంతదేశాలను సందర్శిస్తాడు. తిరుమలకు పయనమవుతూ మార్గమధ్యంలోని అళిపురిసింగరి, తల యేరుగుండు, పెదయెక్కుడు, కపురంపు కాలువలను సందర్శించాడు.

ఇక్కడ అళిపురిసింగరి, తలయేరుగుండు, కురువమండపం, పెద యెక్కుడు, కపురంపుకాలువ, మోకాళ్ళముడుపులను గూర్చి వివరించడం సమంజసం.

## అళిపురి సింగరి:

కొండెక్కుడులో తొలిమెట్టుగల ప్రాంతం అళిపురి. అడిపడి, అలిపిరి అని వ్యవహారనామాలు. ఇక్కడ వెలసిన నృసింహస్వామిని అన్నమయ్య దర్శించాడు.

## తలయేరుగుండు:

కొండను ఎక్కేభక్తులు ఈగుండును తలతో, మోకాటితో తాకి నమస్కరిస్తే తలనొప్పి, కాళ్లనొప్పులువుండవని నమ్మకం. ఈ గుండు మీద

ఆంజనేయస్వామివారిమూర్తి కన్పిస్తుంది. తలయేరుగుండు వద్దనే శ్రీ పాదాలు వున్నాయి. ఇచ్చటనెలకొన్న శ్రీపాదాలనుగూర్చి ఒక ఐతిహ్యం కలదు.

శ్రీరామానుజులవారు తిరుమలనంబివద్ద తలయేరుగుండుసమీపంలో రామాయణ రహస్యార్థాలను తెలుసుకొనేవారు. వారికి రహస్యార్థాలు వివరించే సందర్భంలో తిరుమలనంబికి మధ్యాహ్నం సమయములందు తిరుమలకు వెళ్ళి స్వామి పూజచేయుటకు ఆటంకమేర్పడుతూ ఉండినది. ఇందుకు తిరుమలనంబి బాధచెందగా స్వామి పాదములు తలయేరుగుండువద్ద ప్రత్యక్షమైనట్లు ఐతిహ్యం. స్వామి పాదపద్మాలను అన్నమయ్య-

1) బ్రహ్మకడిగిన పాదము (1-191)

2) ఈ పాదమే కదా యిలయెల్లఁగొలిచినది ॥(1-66) అని కీర్తించి యున్నాడు.

## కురువ మండపం:

తలయేరుగుండు దాటిన తర్వాత కనిపించే విశేషస్థలం కుమ్మర మండపం.

కురువనంబి, కురువరతినంబి అనే కుమ్మరిభక్తునిగూర్చి అన్నమయ్య కీర్తనల్లో పేర్కొన్నాడు. ఈ కుమ్మరి ప్రతినిత్యం కుండలు చేయగా మిగిలిన బంకమట్టితో పూలుచేసి తాను కొయ్యతో తయారుచేసుకొన్న వేంకటేశ్వరుని పూజించేవాడు. తిరుమల అర్చామూర్తిని తొండమాన్ చక్రవర్తి బంగారు పూలతో అర్చించేవాడు. ఒకనాడు చక్రవర్తి సమర్పించిన బంగారు పుష్పాలు తొలగి కురువరతినంబి సమర్పించిన బంకమట్టిపూలు స్వామి చరణాలమీద నిలిచాయి. రాజు కుమ్మరివాని భక్తి విశ్వాసాలను తెలుసుకొని శరణు వేడుకొంటాడు.

'కురువ' అంటే కొండమీదికి వెళ్ళే కాలిత్రోవ. కాలిత్రోవలో కాపురం చేసే నంబి కాబట్టి 'కురువనంబి' అని వ్యవహారం. అన్నమయ్య కురు

వరతినంబిని గూర్చి కొండలలో నెలకొన్న కోనేటిరాయఁడాఁడు (సంపు 1-సంకీ-151), కురువనంబి తిరుమల కురువనంబి (తాళ్ళపాక శేషాచార్యుల వ్రాతప్రతి) అనే సంకీర్తనల్లో ప్రస్తావించాడు.

## పెద్దయెక్కుడు :

ఇక్కడమెట్లు నిట్టనిలువుగా వుంటాయి.

## పల్లవరాయని మఠం :

క్రీ.శ. 1287 ప్రాంతంలో నమ్మాళ్వారు మండపాన్ని నిర్మించిన వాడు పల్లవరాయడు. ఇతడు చేపట్టిన నిర్మాణాల్లో పల్లవరాయని మఠం మరొకటి.

## కప్పురంపు కాలువ :

పెద్దయెక్కుడు, మోకాళ్లముదుపులకు మధ్య ఈ కాలువవున్నది.

అన్నమయ్య కప్పురంపుకాలువ కమ్మనివాసనలు అఘ్రాణిస్తూ గుబురుగా అలముకొన్న చెట్లను, పూపొదలను, జలప్రవాహాలను చూసు కొంటూ మోకాళ్ళపర్వతం చేరాడు. ఆ పర్వతం చేరేటప్పటికి మధ్యాహ్న సమయం కావస్తోంది. అందునా-

ఎన్నఁడు తల్లి పక్కెడపి యెుండెడల
మన్నట్టివాఁడు కాకుండుటవలన
కడప వాకిలిదాటి కడయిండ్లకడకు
నడచుట మునుపు నెన్నఁడులేదు గనుక
..... ..... ..... .....
పాదక్రిందఁగూర్చుండి పాలయు లేఁజెమటఁ
దొడిగిన చెప్పులతోడనే మిగుల
బడలిక నొక రాతిపై ....

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-15)

శయనించాడు.

## మోకాళ్ల ముడుపు :

వేంకటశైలము సాలగ్రామమయమైనది కనుక యాత్రికులు మోకాళ్లతో నడిచేవారని అంటారు. ఒక్కొక్కమెట్టు మోకాలి ఎత్తు కలిగి మోకాళ్లు ముడుచుకొంటూ ఎక్కడంవల్ల మోకాళ్లముడుపనే పేరు వచ్చిందని కూడ అంటారు.

బాలఅన్నమయ్య అలసటను, ఆకలిని జగదంబ అలమేల్మంగ గమనించింది. కరుణాపాంగ అలమేల్మంగ విలసత్కాంతులు వెదజల్లుచు ఒక పెద్దముత్తైదువవలె బాలుడున్న ప్రదేశానికి చేరి సేదతీరుస్తుంది. సాలగ్రామమయమైన తిరుమలను చెప్పుకాళ్లతో ఎక్కరాదని చెప్పి శౌరి, తాను భుజించిన ప్రసాదాన్నాలు పెట్టి కందర్పజనకుని సందర్శించే మార్గం సూచించి అంతర్ధానమవుతుంది. అన్నమయ్య

> అత్తఱి నలుదిక్కు లరసి యా శిశువు
> చిత్తంబులోన వచ్చెరువందుకొనుచు
> ..... ..... ..... .....
> ..... ..... .... ఆ పద్మ
> తన కేల విడు ప్రసాదప్రభావమున
> పరమ సారస్వత పారీణుఁడగుచు
> పరప కవిత్వవాచాప్రౌఢి మెఱసి
> యలమేలుమంగకు నాశుమార్గమున
> పలలితంబుగ నొక్కశతకంబుఁజెప్పె

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-18)

## శతకచర్చ :

ఈ శతకం వావిళ్లవారిచే 1947సం॥లో ప్రకటించబడింది. వీరు ప్రచురపరచిన 'శ్రీవేంకటేశ్వర శతకం' లో 'వేంకటేశ్వరా' అనే పద్యాంతసంబోధన వున్నా తాళ్లపాకఘనుడు శతకమాలికను సమర్పించినది అలమేలుమంగకే!

32,000 పదాలను శ్రీవేంకటేశ్వరాంకితంగా రచించిన అన్నమయ్య తొలిరచన శ్రీవేంకటేశ్వర శతకం కావడం గమనించదగ్గ విశేషం. 'వేంకటేశ్వర శతక'మని వ్యాప్తిలో వున్నా ఇందలి విషయప్రాధాన్యాన్ని బట్టి ఇది 'మంగాంబికా శతకమే' యని కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అభిప్రాయ పడ్డారు.

అలమేల్మంగకు శతకం సమర్పించి మోకాళ్లముదుపునుండి అన్నమయ్య అలమేల్మంగ ఆశీర్వాదబలంతో తిరుమల చేరుకొంటాడు.

## తిరుమలలో దివ్యస్థలాలను సందర్శించుట :

### పుష్కరిణి:-

అన్నమయ్య తిరుమలలో మొదట సర్వపాపాలను ప్రక్షాళనం చేసే స్వామిపుష్కరిణిని సందర్శించాడు. ఈ స్వామిపుష్కరిణిగూర్చి వరాహ పురాణంలో-

స్వామిపుష్కరిణీ స్నానం సద్గురోః పాదసేవనమ్,
ఏకాదశీవ్రతం చాపి త్రయ మత్యన్త దుర్లభమ్.
దుర్లభం మానుషంజన్మ దుర్లభం తత్ర జీవనమ్,
స్వామిపుష్కరిణీస్నానం త్రయ మత్యన్తదుర్లభమ్.
( అధ్యాయం-35-శ్లోకం-26)

అని ప్రస్తుతించబడి వుంది. స్వామి పుష్కరిణియందు స్నానము, సద్గురుని సమాశ్రయం, ఏకాదశీ వ్రతానుష్ఠానసిద్ధి అనే మూడుసంఘటనలు ఘటిల్లడం పుణ్యవిశేషం. ఎనభైనాలుగులక్షల ప్రాణులలో మనుష్యజన్మ లభించడం దుర్లభం. క్రమంగా వర్ణాశ్రమాలను నెరవేర్చడం దుర్లభం. అందును ఒక్కసారి అయినా శ్రీస్వామి పుష్కరిణియందు స్నానమాచరించడం అత్యంత దుర్లభమని వరాహపురాణం.

అన్నమయ్య పరమపావనం, అఖండవైభవాలకు నిలయమైన

నానావిధానవోన్నతమైన యట్టి
కోనేటు కడతెంచి ..... .....
..... యట కృతస్నానుఁడై
..... ..... ..... .....
పెనుపోబనాలు చూపెడు పోబనాలు
గనుపట్టు స్వామి పుష్కరిణి

(అన్న. చరిత. ద్విపద-పుట-18)

సోయగాన్ని చూసి విస్మయించెంది-

దేవునికి దేవికిని తెప్పలకోనేటమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మా

(పంపు. 2-పంకీ-426)

అని కీర్తిస్తాడు.

అన్నమయ్య సంకీర్తనరాశిలో

ఎందుకు నీకు ప్రియమో యీ తెప్పతిరునాళ్ళు
దిందువడె సిరులతో తెప్పతిరునాళ్ళు

(పంపు.2- పంకీ-143)

అని పుష్కరిణిని వర్ణించిన మరో సంకీర్తన కన్పిస్తున్నది. తిరుమలలో తెప్పోత్సవం ప్రతిమంగళవారం ఆర్జితసేవగా, మరియు ఫాల్గుణశుద్ధఏకాదశి నుండి పూర్ణిమవరకు సర్కారుసేవగా నిర్వహించడం సంప్రదాయం.

## వరాహస్వామి ఆలయం :

స్వామిపుష్కరిణిని సేవించి అన్నమయ్య వరాహస్వామి ఆలయం చేరాడు. తిరుమలకు వరాహక్షేత్రమని నామాంతరం. స్వామి పుష్కరిణికి వాయవ్యదిశయందు ఈ ఆలయం ఉన్నది. వరాహస్వామియే వేంకటేశ్వరునికి తిరుమలలో ఉండటానికి అనుమతి ఇచ్చాడని ప్రతీతి. అందుకు కృతజ్ఞతగా తొలుత వరాహస్వామిని సందర్శనం చేసుకొన్న తర్వాతనే వేంకటేశ్వరస్వామి దర్శనం అని కట్టడి ఏర్పడినట్లు పురాణాలుచెప్తున్నాయి.

ఇప్పటికి తిరుమలలో తొలిపూజ, నైవేద్యాలు వరాహస్వామికే! వరాహస్వామి ఆలయ సందర్శన అనంతరం అన్నమయ్య పెదగోపురానికి, నీడ తిరుగని చింతచెట్టుకు, కోరికలు ఇచ్చే గరుడకంబానికి సాగిలపడి నమస్కరించాడు. చంపకప్రదక్షిణం చేశాడు.

పిదప ప్రసాదశాలకు చేరి తిమ్మప్పనికి నివేదితమైన భక్ష్య భోజ్యాలు, వెన్నగాచిన నేతి వింతపచ్చళ్లు, దధ్యోదనాలు, అప్పాలు, పాలు, అతిరసాలను దాసులకు సమర్పిస్తున్న వైభవానికి-

అప్పేల్పు తళిఘలక్రిందఁ
జిందఁగాఁజేత మూర్చిన వంటివచ్చు
నొకనాఁటి నెయ్యి వేతొక దేవళమున
నొకయేటనైవమ నున్నదే యనుచు -

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-20)

ఆశ్చర్య మొందినాడు. ఈ వర్ణనను బట్టి అన్నమయ్య కాలంనాటికి తిరుమల ఎంతవైభవంగా వెలుగొందినదో వూహించవగును.

ఆట అన్నమయ్య శ్రీనివాసునికి నమస్కరించి, భాష్యకారులను పొగడి, శ్రీనరసింహుని సేవించి, జనార్దనుని సన్నుతించి, అలమేలుమంగకు అభివందనాలు సలిపి, యాగశాలను కీర్తించి, ఆనందనిలయాన్ని దర్శించుకొంటాడు. అట్లే స్వామివారి కళ్యాణ మండపాన్ని, బంగారు గరుడుని, అశ్వ, శేష వాహనాలమ తిలకిస్తాడు.

తిరుమల ఆలయంలో నృసింహస్వామి ఆలయం ఈశాన్యదిశయందు వున్నది. నేటికీ ధనుర్మాస సందర్భంలో నెలరోజులు స్వామికి ప్రసాదనివేదన జరుగుతుంది. వాహనమండపంలోని గరుడవాహనంగూర్చి-

ఇటు గరుఁడని నీ వెక్కినను
పటపట దిక్కులు బగ్గనఁబగిలె॥ అని

(సంపు. 1-సం-కీ-92)

శేషవాహనం గూర్చి

వీఁడు గదే శేషుఁడు శ్రీవేంకటాద్రి శేషుఁడు
వేడుక గరుడనితోఁబెన్నుద్దైన శేషుఁడు॥ అని

(సంపు-3-కీ-365)

అశ్వవాహనం గూర్చి

నీవు దురగము మీఁద నేర్పు మెరయ
వేవేలు రూపము వెదచల్లితపుడు ॥ అని

(సంపు-12-కీ-210)

వివిధ వాహనాలను గూర్చి కీర్తించాడు. పిదప తట్టుపునుగు తయారుచేసే ప్రదేశాన్ని సందర్శించాడు. తట్టుపునుగు తయారు చేసే ప్రదేశం చెంతనే బంగారుపళ్లెంలో చక్కెర లారగించుచు 'వేంకటపతిని సేవించండి, కాను కలు సమర్పించండి, కొండలప్పకు దండాలు పెట్టండి' అని పలుకుతున్న పంచవన్నియు రామచిలుకల పలుకు లాలకిస్తాడు అన్నమయ్య. స్వామివారి పట్టుపీతాంబరాలున్న శ్రీభండారాన్ని చూశాడు. తన పంచ కొంగున దాచు కొన్న ఒకకాసుతీసి బంగారు గాదెలకు నమస్కరించి స్వామికి సమర్పించాడు. బంగారు వాకిలిచేరి స్వామిని దర్శించి పులకితగాత్రుడయ్యాడు.

ఈవర్ణన లాధారంగా అన్నమయ్య కాలంనాడు తిరుమలలో భక్తులు శ్రీ వేంకటేశ్వరుని దర్శించుచుండిన క్రమమే కాక, నాటి దేవాలయ పరి సరాలు కూడా విదిత మవుతున్నాయి. తిరుమల ఆలయ పరిసర వర్ణనలకు సంబంధించిన సంకీర్తనలు వీరి వాఙ్మయంలో అనేకం కన్పిస్తాయి.

మచ్చునకు ఒక సంకీర్తన-

సేవించి చేకొన్నవారిచేతి భాగ్యము
వేవేగ రారో రక్షించీ విష్ణుఁడీతఁడు॥
గరుడ గంభముకాడ కదుఁబ్రాణాచారులకు
వరము లొసఁగీని శ్రీవల్లభుఁడు
తిరమై కోనేటిచెంతఁదీర్థఫలము లెల్ల
పరుషల కొసఁగీని పరమాత్ముఁడు॥

పేవమొదలారివద్ద చిత్తములో సుజ్ఞానము
వానాగతిఁబుట్టించీవి నారాయణుఁడు
కామక పైఁడి గాదెలకాడఁ దవనిజరూపు
అనుక పాదచూపీవి అఖిలేశుఁడు॥

సన్నిధిగర్భగృహాన చనవిచ్చి మాటలాడి
విన్నపాలు వివీ శ్రీవేంకటేశుఁడు
యెన్నికఁబాదాలవద్ద యిహముఁబరముఁజూపీ
మన్ననల అలమేలుమంగ విభుఁడు॥

(సంపు-3-కీ-511)

ఈ విధంగా అన్నమయ్య తిరుమల ఆలయపరిసరాలన్ని తిలకించి బంగారువాకిలిచేరి శ్రీనివాసుని దివ్యమంగళవిగ్రహాన్ని సందర్శించాడు.

వైభవోన్నతమైన స్వామి దివ్యమంగళ విగ్రహాన్ని సందర్శించి

దేవ దేవుఁడితఁడే దివ్యమూరితి
యేవలఁజూచినఁదానే యీరూపైవున్నాఁడు ॥
వెంకటాచలముమీఁది విశ్వరూప విశేషము
అంకెల ననంతావతారాలైన విశేషము ॥

(సంపు-10-కీ-501)

అని కీర్తించాడు. సర్వాలంకారశోభితుడైన స్వామిని గూర్చి ఆనందాతిశయంతో

కంటిఁగంటి విలువుచక్కవిమేను దండలును
నంటుఁజూపులను జూచేనవ్వుమోము దేవుని ॥

కనకపుఁబాదములు గజ్జెలు నందెలును
ఘనపీతాంబరము పైకట్టు కటారి
మొనపి యెద్దాణంపు మొగపుల మొలనూలు
ఒనర వాళీకమల ముదర బంధములు ॥

(అన్న. చరిత్ర పీఠిక-పుట-23)

అని వినుతించాడు. స్వామి పాదపద్మాలను-

ఈ పాదమేకదా యిలయెల్లఁగొలచినది
యీ పాదమేకదా ఇందిరాహస్తముల కితవైనది ॥

(సంపు-1-కీ-66)

అని శ్లాఘించాడు. స్వామివారి సుదర్శనచక్రాన్ని-

మొక్కెద మిదివో మూఁడు మూర్తులును
వొక్కరూపమై వొనరెఁజక్రము ॥

(సంపు-2-కీ-516)

అని స్తుతించాడు.

తాళ్ళపాక అన్నమయ్యపుత్రుడు తాళ్ళపాక పెదతిరుమలయ్య సుదర్శన చక్ర మాహాత్మ్యాన్ని 'సుదర్శ రగడ' అనేపేరుతో కావ్యంగా వెలయించాడు. శ్రీమహావిష్ణువు పంచాయుధాల్లో ఒకటైన సుదర్శన చక్రాన్ని-

'ఓంకారాక్షర యుక్తము చక్రము
సాంకమధ్య వలయాంతర చక్రము
సర్వఫలప్రద సహజము చక్రము
పూర్వకోణ సంపూర్ణము చక్రము
హర విరించి దివిజాశ్రయ చక్రము
గురుగతి రెండవకోణపుఁజక్రము'

(లఘుకృతులు-పుట-64)

అని భక్తిప్రపత్తులతో కీర్తించాడు.

తాళ్ళపాకలో చెన్న కేశవస్వామి ఆలయంముందట సుదర్శన చక్రం ప్రతిష్ఠించబడి వుంది. ఇంతేకాక తిరుపతి గోవింద రాజస్వామి ఆలయ ప్రాంగణంలో సుదర్శనస్వామి చక్రత్తాళ్వారు మూలమూర్తి ప్రతిష్ఠితమై వున్నది.

స్వామి దివ్యమంగళవిగ్రహాన్ని, ఆయుధాలను అన్నమయ్య పరిపరివిధాల కీర్తించి తన్మయత్వంతో-

కంటి నయ్యఖిలాండకర్త నే నధికుఁ
గంటి నాయఘము నిక్కము వీడుకొంటి ॥
(అన్న. చరిత్ర.ద్విపద-పుట-23)

అని స్వామిని కీర్తించగా అచ్చటి అర్చకులు బాలుని భక్తితత్పరతకు ముగ్ధులై తీర్థప్రసాదాలుఇచ్చి శఠగోపంతో దీవించారు. వెంటనే-

శ్రీహరి పాదతీర్థంబే చెడనిమందు
మోహపాశాలుగోసి మోక్షమిచ్చేమందు ॥

కారమై కంటగించని కడుఁజల్లని మందు
నూఱని కాచనియట్టి నున్నని మందు ॥

పంకజాక్ష వేంకటరమణ ప్రపన్నుని మందు
పెంకించక తన దాసులఁజేపట్టేమందు ॥
(అన్న. చరిత్ర-ద్విపద-పుట-34)

అని స్వామి తీర్థమహాత్మ్యాన్ని కొనియాడి ఆనాటికి ఒకమండపంలో విశ్రమించాడు అన్నమయ్య.

## తీర్థ సందర్శనం:

మరునాడు అన్నమయ్య తిరుమలమీద ప్రసిద్ధములైన కుమారధారా తీర్థం, అమరతీర్థం, ఆకాశగంగ, జరహరతీర్థం, వలిఘ్నతీర్థం, విరజాతీర్థం, పాపవినాశనం, వైకుంఠతీర్థం, జాబాలితీర్థం, చక్రతీర్థం, తుంబురుతీర్థం, కాయరసాయనతీర్థం, విష్వక్సేనతీర్థం, పంచాయుధతీర్థం, అగ్నికుండతీర్థం, బ్రహ్మతీర్థం, సప్తఋషితీర్థం, పాండవతీర్థం, దేవతీర్థాదులన్నింటిని సందర్శించాడు. ఈ ప్రసిద్ధతీర్థాల ప్రస్తావన వరాహస్కాంద పురాణాల్లో కన్పిస్తుంది. తిరుమలలో వెలసిన పుణ్యతీర్థాలను గూర్చి వరాహపురాణంలో -

**త్రిస్రః కోట్యోఽర్థకోటీ చ తీర్థాని భువనత్రయే,**
**తేషాం ప్రకృతిభూతాని తీర్థాన్యస్మిన్ హరేర్గిరౌ.**
(వరాహపురాణం-41 అధ్యాయం-19 శ్లోకం)

అని పేర్కొనబడినది.

అన్నమయ్య సర్వతీర్థాలను సేవించి, స్నాన మాచరిస్తూ

..... ..... ..... ..... ఆ తేటనీట
ధవళంబుగా మును దాఁగట్టు చీర
నుదికి యారగవైచి యొకరాతి దండ
నది యెండ నారెదు నంత లోపలనె
శతకంబు కుతుకంబు సమకూరఁజేసి

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-24)

ఇలా అన్నమయ్య స్వామివారికి శతకాలను సమర్పించాడు.

## శతకమాహాత్మ్యం :

అన్నమయ్య తీర్థస్నానం ముగించుకొని పంద్రెండునామాలు తీర్చుకొని స్వామి సందర్శనానికి వెళ్ళాడు. ఆలయం మూసివుంది. వెంటనే-

వేంకటపతి మీఁద వివరస్తవముగ
వేంకట శతకంబు విన్నవించుటయు

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-25)

వెంటనే ఆలయం తలుపులు తెరచుకొన్నాయి. అర్చకులు అన్నమయ్య మహిమను గుర్తించారు. అన్నమయ్యను స్వామి సందర్శనానికి తీసుకు వెళ్ళారు. అన్నమయ్య అక్కడ వేంచేసివున్న గరుడాళ్వారుని, విష్వక్సేనుని, సీతా లక్ష్మణ హనుత్సమేత శ్రీరామచంద్రుని సేవించాడు.

## విష్వక్సేనులు:

వీరికి సేనైమొదలారను నామాంతరం కలదు. తిరుమల గర్భగుడిలో ఉత్సవమూర్తులతో ఈ మూర్తి పూజించబడుతోంది. అధ్యయనోత్సవ సమయంలో ఈ దేవునకు ప్రత్యేకమైన ఆరాధన కలదు.

అన్నమయ్య సంకీర్తనా వాఙ్మయంలో సేనమొదలారికి సంబంధించిన రెండు కీర్తనలు కన్పిస్తాయి.

పటు శిష్టప్రతిపాలకుఁడ వనఁగ
ఘటన నఖిలమును గాతువుగా ॥

(సంపు-1-సంకీ-207)

నీవేకా చెప్పఁజూప నీవె నీవెకా
శ్రీవిభు ప్రతినిధివి సేనమొదలారి ॥

(సంపు-1 సంకీ-255)

స్వామి సన్నిధిలో వెలసిన హనుమంతుని గూర్చి కాబోలు అన్నమయ్య-

ఓ పవనాత్మజ ఓ ఘనుఁడ
బాపు బాపనఁగ బరగితిగా ॥

ఓ దశముఖహర వేంకటపతి
పాదసరోరుహ పాలకుఁడా ॥

(సంపు-11 భా-1-సంకీ-31)

అని కీర్తించాడు.

అన్నమయ్య అర్చకులవెంట వివిధఅర్చామూర్తులను సంసేవించి వేంకట గిరిపతి ఎదుట నిలిచాడు.

"మురవైరి రెండవమూర్తి యో యనఁగఁ
గర మొప్పచున్న వైఖానసోత్తముఁడు
నంబి వెంగటఁబూజనము సేయు తఱిని
పంబిన భక్తి నబ్బాలుండు మఱియు
వెంకటప్పకు విన్నవించిన తొంటి
వేంకటశతకంబు"... ..... .....

(అన్న. చరిత్ర,ద్విపద-పుట-26)

విన్నవించాడు. వెంటనే స్వామి ధరించిన ముత్యాలహారం క్రిందపడింది. అర్చకులు సంభ్రమంతో బాలునిమహిమను కొనియాడారు.

## వేంకటేశ్వరశతక చర్చ :

తాళ్లపాకచిన్నన్న ద్విపద ఆధారంగా పరిశీలిస్తే అన్నమయ్య అలమేలు మంగకు నాశుమార్గమున

సలలితంబుగ నొక్క శతకంబుఁజెప్పె

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-18)

అని అలమేలుమంగాంబికా శతకాన్ని,

వేంకటపతిమీఁద వివరస్తవముగ
వేంకట శతకంబు విన్నవించుటయు

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-25)

అనుటను బట్టి వేంకటేశ్వర శతకాలను చెప్పినట్లు తెలుస్తోంది.

కథాసందర్భాన్నిబట్టి చిన్నన్న పేర్కొన్న ఈ రెండు శతకాలు వేర్వేరని స్పష్టమవుతున్నది. కాని ఇందులో వేంకటేశ్వర శతకం ఒక్కటే లభ్యం. ఇందులో అలమేల్మంగాంబికాస్తుతి, మహామహిమాన్వితమైన జగన్మాతృ వైశిష్ట్యం వర్ణించబడినది. ఈ శతక అంకితాంక పద్యం కూడా అమ్మవారికి సమర్పింప బడినదియే! కనుక మనకు లభ్యమైన వేంకటేశ్వర శతకమే 'మంగాంబికాశతకం' అని అభిప్రాయ పడవచ్చును. స్వామితీర్థ సందర్శన సమయంలో అన్నమయ్య చెప్పినట్లుగా పేర్కొనబడిన వేంకటేశ్వరశతకం లభించలేదు.

అన్నమయ్య స్వామివారి ప్రసాదాలను స్వీకరించి ఆ రోజుకు వరాహస్వామి ఆలయంలో విశ్రమించాడు. తిరిగి ద్వాదశినాడు స్వామిని సందర్శించుకొని తిరువీథులవెంట కోవెలచుట్టి నారాయణ నామస్మరణ చేస్తూ ఒక పంచతిన్నెపై విశ్రమించాడు.

## పంచసంస్కార దీక్ష:

ఆ ద్వాదశి స్వామి అన్నమయ్యను అనుగ్రహించిన దినం. వైష్ణవమత స్వీకారానికి స్వామి సంకల్పం పొందినరోజు. ఆ రోజుల్లో ఘనవిష్ణువు

అనే వైష్ణవయతి తిరుమలలో నివసించేవాడు. అతడు మహాభాగవతుడు. వైష్ణవతత్త్వాన్ని ప్రబోధించేవాడు. ద్వాదశిరాత్రి స్వామి యతికి కలలో కనిపించి-

..... ..... ..... ..... తాళ్లపాకాన్న
మయ నామకుండైన మద్భక్తుఁడొకఁడు
వడుగు నల్లనిచిన్నవాడు న న్నెపుడు
నడుఁకక సంకీర్తనము సేయు నెపుడు
ముద్దుగారెడువాఁడు మోహనంబైన
మద్దికాయలవాఁడు మనవాఁడె వాఁడు
గుదిగొన్న నునుపట్టుకుచ్చుల దండె
ముదమున నిజభుజంబున నించువాఁడు
కడువేగ రేపు నీకడ కేఁగుదెంచుఁ
దడయక నీవు ముద్రాధారణంబు
గావింపు నామాటుగా వాని కనుచు ॥

(అన్న. చరిత్ర.ద్విపద-పుట 27)

అని స్వామి తన ముద్రికలు యతికి ఇచ్చాడు. స్వామివారి భక్త వాత్సల్యానికి ఆనంద పరవశుడైనాడు ఘనవిష్ణువు. మరుదినం యతి సంధ్యావందనాదులు ముగించుకొని స్వామి సమర్పించిన శంఖ చక్రముద్రికలతో యజ్ఞశాలకు చేరాడు.

అచట అన్నమయ్య-

శ్రీహరి నిత్యశేషగిరీశ
మోహనాకార ముకుంద నమో శ్రీహరి ॥

దేవకీసుత దేవ వామన
గోవిందా గోపగోపీనాథా ॥

పురుషోత్తమ పుండరీకాక్ష
గరుడధ్వజ కరుణానిధి ॥

(సంపు.3-కీ-527)

అంటూ భగవత్సంకీర్తనలు ఆలపిస్తున్నాడు. ఘనవిష్ణువు స్వామి చెప్పినట్లు బాలుని ఆనవాళ్ళు గమనించాడు. సంతృప్తిచెందాడు. బాలుని సమీపించి స్వామి ఆదేశించినట్లు-

వేదమార్గాను సారమున
నాతని శంఖచక్రాంకితుఁజేసి
రీతిగాఁబంచసంస్కృతులు"

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-28)

గావించాడు. నాటినుండి అన్నమయ్య అన్నమాచార్యుడయ్యాడు. వైష్ణవంలో పంచసంస్కారాలు అతి ప్రధానాలు.

తాపః పుండ్రః తథా నామ మంత్రో యాగశ్చ పంచమః,
అమీ పరమసంస్కారా పారమైకాంత్య హేతవః.

తాపము (రెండు భుజముల ముద్రికల ధారణ), పుండ్రము (ముఖమున మరియు భుజము, వక్షస్థలాదులందు కలిపి మొత్తం ద్వాదశోర్ధ్వ పుండ్రములు), నామము (దీక్షాసమయము నుండి 'శ్రీనివాస దాసః' ఇత్యాదిగా నామముతో వ్యవహరింప బడుట), మంత్రము (ఓం నమో నారాయణాయ), యాగము (భగవదారాధన పద్ధతి) ఇవీ పంచసంస్కారాలు.

## వైష్ణవం :

విష్ణువే ప్రధానదైవతంగా కలిగిన మతం వైష్ణవం. భగవద్రామానుజులు వైష్ణవమత స్థాపనకు అవతరించిన దివ్యమూర్తి. అన్నమయ్య వీరిని తమ దైవంగా భావించాడు. సర్వవిద్యాపారంగతులై, విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవర్తకులై ప్రకాశించారు. క్రీ.శ. 10-11వ శతాబ్దాల కాలంలో దక్షిణభారతంలో జైన, బౌద్ధ, శైవమతాల వ్యాప్తి అధికంగావుండేది. క్రీ.శ. 11వ శతాబ్దంలో రామానుజులు తిరుమలను వైష్ణవపుణ్యక్షేత్రమని నిరూపించి వైఖానస ఆగమం ప్రకారం ఆలయ ఆగమవిధానాలు కట్టడి చేశారు. రామానుజుల విశిష్టాద్వైతతత్త్వమే అన్నమయ్యకు ఘనవిష్ణువు ప్రబోధించాడు.

వైష్ణవమత ప్రాశస్త్యం గూర్చి-

వలెనను వారిదె వైష్ణవము యిది
వలపుఁదేనెవో వైష్ణవము ॥
యెదుటను శ్రీవేంకటేశ్వరు నామము
వదనము చేర్పుట వైష్ణవము ॥ (1-405)

ఇరవుగ శ్రీవేంకటేశ్వరు మతమే
పిరుల వమ్మెదురు శ్రీవైష్ణవులు (1-402)

పహజవైష్ణవాచార వర్తనుల
పహవాపమె మాసంధ్య ॥ (1-10)

కోవిదు శ్రీవేంకటేశుఁగొలిచి పెద్దలకృప
వావివర్తనగలవాఁడువో వైష్ణవుఁడు ॥ (1-59)

వైష్ణవులుగాని వారలెవ్వరు లేరు
విష్ణుప్రభావ మీవిశ్వమంతయుఁగాన ॥ (1-36)

ఉమ్మడి మీసేవ సేసుకుండేటి వైష్ణవుల
సమ్ముఖాన సేవించుటే చాలదా నాకు ॥ (3-23)

అని అన్నమయ్య పలుకీర్తనల్లో శ్లాఘించాడు.

అన్నమయ్యవల్లనే తాళ్ళపాకవారు వైష్ణవం స్వీకరించి ధన్యులైనారు. ఈ విషయాన్నే అన్నమయ్య మనుమడు చినతిరుమలయ్య-

ఎట్టి హితోపదేశకుఁడెటువండి దయాళువు
అట్టె తాళ్ళపాకన్నమాచార్యులు ॥
పచ్చితామసుల మమ్ముఁబరమ సాత్త్వికులఁగా
యిచ్చటనె సేసినాఁడు యెంతచిత్తము

యిచ్చగించి మాకులాన నెన్నఁడులేని వైష్ణవ
మచ్చముగాఁగృప సేసె నన్నమాచార్యుఁడు ॥

(సంపు-16-భా-1-కీ-52)

అనే కీర్తనలో ప్రస్తావించాడు.

'అన్నమయ్య జీవితచరిత్ర' ద్విపదలో అన్నమయ్య వైష్ణవ దీక్షా స్వీకారము, తాళ్లపాకకు చేరడం, వివాహం చేసుకోవడం కన్పిస్తున్నది. ఈ సందర్భంలో ద్విపద కావ్యంలో కొంత భాగం శిథిలమైనట్లు తోస్తున్నది.

అన్నమయ్య వైష్ణవమత స్వీకారం తర్వాత కొన్ని సంవత్సరముల పాటు తిరుమలలోనే గడిపినట్లు భావించవచ్చు. అన్నమయ్య ఎనిమిది సంవత్సరాల పిన్నవాడుగ తిరుమలకు వస్తాడు. అట తాళ్లపాకలో నారాయణసూరి, లక్కమాంబలు అన్నమయ్యకోసం పరితపించారు. తుదకు స్వామి అనుగ్రహంచే లక్కమాంబ నారాయణసూరి దంపతులు తిరుమలకు చేరారు. తిరుమలలో తన పుత్రునికోసం వెదికారు. వైష్ణవదీక్ష పొంది, శంఖ చక్రముద్రికలు ధరించి స్వామిపై సంకీర్తనలు ఆలపిస్తున్న అన్నమయ్యనుచూచి ఆ తల్లిదండ్రులు పరవశించిపోయారు. భక్తవత్సలుడైన వేంకటవిభుదు తన తనయునిపై కురిపించిన అనుగ్రహానికి తన్మయు లవుతారు. తమ బిడ్డ కారణజన్ముడని గ్రహించారు. అయినా కదుపుతీపితో అన్నమయ్యను తాళ్లపాక రమ్మని ఆహ్వానిస్తారు. నిరంతరం హరిచరణ స్మరణాసక్తుడగు అన్నమయ్య తల్లితో తాళ్లపాకకు వెళ్ళుటకు ఇష్టపడదు. తల్లిమాటను కాదనలేదు. అందుకే తిరుమలవాసుని-

బల్లిదులు నీకంటెఁబరులున్నారా నన్నుఁ
దొల్లిటిబారి నింకఁదోయకుమో యయ్య

(సంపు-11-1-సంకీ-65)

అని వేడుకొంటాడు. ఆనాడు అన్నమయ్యకు కలలో స్వామి ఆదేశం వినిపించింది.

పరచింత ఉడిగి నాపైనె విన్యస్త
భరుఁడవై యుండ శుభంబు లన్నియును

ననఘాత్మ నినుఁజెందు నని వరం బిచ్చి
జననివాక్యము ద్రోయఁజనదు కుమార!
పోయి రమ్మనిన నప్పుడు మేలుకాంచ
యా యచ్యుతునిఁగొనియాడి మ్రొక్కుచును
జననియుఁదాను నిచ్చలుఁదొంటిపురికి
జనుదెంచి నిజనివాసముఁబ్రవేశించె.

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-28-29)

## తాళ్లపాకలో అన్నమయ్య :

స్వామి ఆదేశం ప్రకారం అన్నమయ్య తాళ్లపాక చేరుకొంటాడు. తిరుమలవీడినా, తాళ్లపాకచేరినా అన్నమయ్య భగవత్సం కీర్తన గానాన్ని, నారాయణనామస్మరణాన్ని విడనాడలేదు. నవవిధ భక్తిమార్గాలలో ఒకటైన సంకీర్తన భక్తిమార్గాన్ని అనుసరిస్తున్న వాడు, ఆరాధిస్తున్నవాడు అన్నమయ్య.

భక్తిరసామృతసింధువులో-

"నామ లీలాగుణాదీనాముచ్చైర్భాషాతు కీర్తనమ్". అన్నట్లు భగవన్నామాన్ని, లీలల్ని, గుణాలను కీర్తిస్తూ తాళ్లపాకలో భగవత్తత్త్వబోధనకు శ్రీకారం చుట్టాడు-

ఈతని మూలమెపో యిలఁగల ధనములు
యీతఁడు మాకుఁగలఁడు యెంతలేదు ధనము.

(2-457)

మాయకిదె సహజము మాయను గెలువరాదు
మాయానాథుఁగొలిచిలే మన్నించు నాతఁడే.

(2-240)

కలవి రెండే భూమి కామనిధానంబులు
జలజాక్షుఁడు నతని శరణాగతియు.

(3-412)

హరిగొలిచినవారి కమరు నన్నిసుఖాలు
గరిమతో వారలభాగ్యమే భాగ్యము.

(3-119)

అని అనేక విధాలుగా పరతత్త్వాన్నిగూర్చి తాళ్లపాకలో ప్రబోధించ సాగాడు. యౌవనదశలో అన్నమయ్య వైరాగ్యగీతాలు పాడడం గ్రామస్థులకు వింతగా తోచినది. బంధుజన పరిహాసమూ తప్పలేదు.

## అన్నమయ్య వివాహం :

**అన్నమయ్య వైఖరిని ఆతని తల్లిదండ్రులు గమనించారు. పర్య వసానంగా పెండ్లి ప్రయత్నాలు చేయసాగారు. ఫలించలేదు.**

ఏ వేళఁజూచిన నితఁడు శ్రీరామ
గోవింద హరి యనుకొనుచుండుఁగాని
యులవోక సంసారమది యిచ్చఁదనకు
వలెననఁడది యెటువంటి గొంటైన
నాచారముల దాసరయ్యను జూచి
చూచి యే గతిఁబదుచుల విచ్చు ననిన.

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-29)

చివరకు భగవదనుగ్రహంచే-

..... ..... ..... వారిజోదరుఁడు
దారియు మొనఁజూపి తనదు భక్తునకు
నన్నయార్యునకుఁగన్యకల నిమ్మనిన
నన్నన్న యని వారు నరుదందికొనుచు
తిరుమలమ్మను నొక్కతిరువాలుఁగంటి
నరుదైన యక్కలమ్మను నొక్కకన్య
..... ..... ..... .....
క్రన్నన నాగమోక్త ప్రకారమునఁ
జెన్నుగాఁబెండ్లిండ్లు చేసి రంతటను.

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-29)

అన్నమాచార్యుడు గృహస్థాశ్రమధర్మాన్ని నిర్వర్తిస్తూ భగవంతుని సేవలో నిమగ్నమయ్యాడు.

అన్నమయ్య భక్తికి, అనురక్తికి వేంకటవిభుఁడు పరవశించి పోయేవాడు. అన్నమయ్య స్వామి ఆదేశంప్రకారం పదహారోయేట నుండి రోజుకొక్క సంకీర్తన రచిస్తూ సంకీర్తనయజ్ఞాన్ని నిర్విఘ్నంగా కొనసాగించాడు. పల్లవి, చరణాలతోకూడిన కీర్తనకు తెలుగువాఙ్మయచరిత్రలో స్థిరత్వం కల్పించాడు.

## అహోబల ప్రయాణం:

సంకీర్తనయజ్ఞాన్ని నిర్వహిస్తున్న అన్నమయ్యకు భగవత్తత్వాన్ని ఉద్బోధించే వేదాంతరహస్యాలను తెలుసుకోవాలనే సంకల్పము కలిగింది. ప్రసిద్ధవైష్ణవక్షేత్రమైన అహోబలానికి పయనమయ్యాడు. అహోబలం కర్నూలు జిల్లా సిరివోలు మండలంలో రుద్రవరంగ్రామానికి ఐదుమైళ్ళ దూరంలో నల్లమల కొండల మధ్య కుదుర్కొని వున్నది. అహోబలమఠ స్థాపకుడైన ఆదివన్ శఠకోపయతిని అన్నమయ్య ఆశ్రయిస్తాడు.

అహోబలనృసింహుడు తానే గురువై త్రిదండాలను, మంత్రాలను శఠకోపయతికి అనుగ్రహించాడు. హయగ్రీవానుగ్రహాన్ని పొంది సన్యాసియై వేదాంతదేశికుని సంప్రదాయానుచరుడై వైష్ణవమత ప్రచారకుడుగా కీర్తిపొందినవాడు శఠకోపముని.

రాయలకాలంనాటి శాసనాల్లో శఠకోపయతుల మఠప్రస్తావన కనిపిస్తుంది. తిరుపతిలో వైష్ణవమత ప్రచారానికి శ్రీమద్రామానుజులు, వేదాంతదేశికులు, శఠకోపయతులు, వ్యాసతీర్థులు ఎంతగానో కృషి చేశారు. అన్నమయ్య శఠకోపయతి వద్దనే విశిష్టాద్వైత వేదాంతం అధ్యయనం చేశాడు. నృసింహమంత్రాన్ని పొందాడు. ఆ మంత్ర ప్రభావంచే అన్నమయ్య వేంకటేశ్వరునివలె విశేషంగా అహోబల నృసింహుని ఆరాధించాడు. శ్రీవేంకటేశ్వరునిపై కాక అహోబల నృసింహునిపై రచించినన్ని సంకీర్తనలు మరే ఇతర దైవంపై రచించలేదు. అన్నమయ్య 32,000

సంకీర్తనల్ని రచించాడని ద్విపద ఆధారంగా స్పష్ట మవుతున్నది. ముప్పై రెండు అక్షరాల నృసింహ మంత్రపఠన ప్రభావంచే అక్షరానికి వేయివంతున 32,000 సంకీర్తనలు రచించినాడని తాళ్ళపాక వాఙ్మయ పరిష్కర్తలైన శ్రీ గౌరి పెద్ది రామసుబ్బశర్మ గారి అభిప్రాయం. అన్నమయ్య శఠకోపయతిని-

> చూడుఁడిందరికి సులభుఁడు హరి
> తోడునీడయగు దొరముని యితఁడు ॥
>
> కరుణానిధి రంగపతికిఁగాంచీ
> వరునకు వేంకటగిరిపతికి
> నిరతి నహోబల నృకేసరికిఁద
> త్పరుడఁగు శఠకోపముని యితఁడు ॥ (1-117)

అని స్తుతించాడు.

## నృసింహ సంకీర్తనలు :

అన్నమయ్యపదాల్లోని నృసింహసంకీర్తనలను స్థూలముగా పరిశీలిద్దాం.

ప్రాచీన వాఙ్మయంలో జగద్గురువు శ్రీశంకరాచార్యులు రచించిన 'శ్రీలక్ష్మీనృసింహస్తోత్రం' ప్రసిద్ధమైనది. తెలుగువాఙ్మయంలో ఎఱ్ఱన 'నృసింహపురాణం'లో లక్ష్మీనృసింహావతార వైభవం గూర్చి విపులంగా వున్నది.

శతకవాఙ్మయంలో నృసింహునిపై ధర్మపురి నరసింహశతకం (శేషప్ప కవి కృతం), సింహాద్రినారసింహ శతకం (గోగులపాటి కూర్మనాథకవి), తరిగొండ నృసింహశతకం మొదలుగా ఎన్నో శతకాలు వెలిశాయి.

జానపద వాఙ్మయంలో, యక్షగానాల్లో నృసింహుడు 'నరహరి'గా, శ్రీమహాలక్ష్మి 'చెంచులక్ష్మి'గా వినుతికెక్కారు.

అన్నమయ్య లక్ష్మీనృసింహుని దివ్యస్వరూపాన్ని, అవతార విశేషాల్ని, వివిధక్షేత్రమహాత్మ్యాల్ని వర్ణిస్తూ ఎన్నోకీర్తనలు విరచించాడు. అన్నమయ్య ఎగువ, దిగువ అహోబల క్షేత్రమూర్తులనే కాక సింహాద్రి, వేయి నూతల (ఓగునూతల), వేదాచలం, కనకగిరి, బొమ్మిరెడ్డిచెర్లలో నెల కొన్న నృసింహస్వామిని కీర్తించాడు. అన్నమయ్య నృసింహుని, రాముని,

కృష్ణుని, ఏదైవాన్ని కీర్తించినా అందరికీ తుదిచరణాల్లో శ్రీవేంకటేశ్వరునితో అభేదత్వాన్ని కల్పించి కీర్తించాడు.

## అహోబల సంకీర్తనలు :

అనాది జగమున కౌభళము
అనేకాద్భుతం బౌభళము
తగు శ్రీవెంకటధామ విహారం
బగు శుభాంచితం బౌభళము ॥

(సంపు-10 సంకీ-29)

ఎగువ అహోబలం :

పెదయౌబళపుఁగొండఁబెరిగినిదే
వదలక కొలిచితే వరము లిచ్చీని

(సంపు-11-1-సంకీ-13)

అహోబలపరిసరాల్లో వెలసియున్న నవనారసింహులను-

జ్వాలాఽహోబల మాలోల క్రోడ కారంజ భార్గవాః
యోగానంద చ్ఛత్రవట పావనా నవమూర్తయః.

అని పూర్వులు స్తుతించి వున్నారు. అన్నమయ్యకూడా-

నవనారసింహా నమో నమో
భవనాశితీర యహోబలనారసింహా

(1-సంకీ-453)

అనే కీర్తనలో నవనారసింహక్షేత్రాలైన జ్వాల, వీర, యోగా నంద, కాను గుమాని (కారంజ), మట్టెమళ్ళ, భార్గోటి, ప్రహ్లాద, క్రోడాకార, మాలోల నృసింహులను కీర్తించియున్నాడు.

భవనాశి తీరంలో సాగే లక్ష్మీనృసింహుల లీలావిహారాలను కూడా అన్నమయ్య అనేక సంకీర్తనల్లో కీర్తించాడు.

మచ్చునకు :

ఇంతులాల చూడరమ్మ ఇద్దరు జాణలే వీరు
చెంత రమాదేవిఁగూడె శ్రీనరసింహుఁడు ॥

భవనాశిలోని నీరు పైఁజల్లులాడుకొంటాను
నవకపు సిడుఁబసు నవ్వుకొంటాను
జవళిఁగెమ్మోవులు సన్నలఁజూపుకొంటాను
చివన నిందిరనంటె శ్రీనరసింహుఁడు. (సంపు-11-1-కీ-216)

నృసింహజయంతి :

జగతి వైశాఖశుద్ధచతుర్దశి మందవార
ముగణితముగఁగూడెనదె స్వాతియోగము ॥
(సంపు-10 సంకీ-285)

## చెంచెతపదం :

కవయఁగవలెనంటె కాఁగలించేనా నీ
వువిదలఁదలఁచక వుండనోపేవా ॥
పారిటాకులఁగట్టి పారనోపేవా
యేరులెల్ల దాఁటి కొండలెక్కనోపేవా ॥
(12-225)

ఇలా నృసింహస్వామి యొక్క మాహాత్మ్యాన్ని, లీలలను, ఉత్సవ విశేషాలను సంకీర్తనల్లో కీర్తించి తరించాడు అన్నమయ్య.

అన్నమయ్య అహోబలం ఆదివన్ శఠకోపయతివద్ద వేదాంత రహస్యాలు తెలుసుకొని-

హరిపూజ హరిసేవ హరి కీర్తనంబు
హరిమననము ధ్యాన మనిశంబుఁదనకు
ఘనతర సకల భోగంబులుగాఁగ
మనుచు వాల్మీకి రామాయణ మెల్ల
రాగంబుతో ననురాగంబుతోడ
బాగుగా గంధర్వ బాగుగాఁజదివి
పాట లన్నియుఁదనపాట పిమ్మటన
పాటపాటనె పాటపాడి చూపఁగను
(అన్న. చరిత్ర.ద్విపద-పుట-30)

తుంబురుడో, నారదుడో, గంధర్వుడో అని అన్నమయ్యను సర్వజనులు ప్రస్తుతించేవారు. ద్విపదలో అన్నమయ్య రచించినట్లుగా పేర్కొనబడుతున్న 'రామాయణం' లభించలేదు. కాని అన్నమయ్య సంకీర్తన రాశిలో రామాయణకథతో ముడివడిన కీర్తనలు ఎన్నో వున్నాయి.

## రాజాశ్రయం :

అన్నమయ్య విఖ్యాతిని టంగుటూరును పరిపాలించే సాళువ నరసింహ రాయలు విన్నాడు. అన్నమయ్యను తనకొలువుకు రమ్మని ఆహ్వానిస్తాడు.

ఇట సాళువవంశజుల గూర్చి ప్రస్తావించడం సమంజసం.

విజయనగరరాజులకు, తిరుమల క్షేత్రానికి వున్న అనుబంధం ప్రసిద్ధమైనది. శాశ్వతమైనది. విజయనగరాధీశులైన సంగమ, సాళువ, తుళువ, అరవీటి వంశాలవారు తిరుమల ప్రభువునకు అనేక కైంకర్యాలుచేసి తమ భక్తి ప్రపత్తులను చాటుకొన్నారు.

## తిరుపతి-సాళువవంశం :

సాళువవంశ్యులు విజయనగరపాలకుల్లో రెండవవంశానికి చెందినవారు. సాళువరాజు విజయనగరాన్ని క్రీ.శ. 1485 నుండి క్రీ.శ.1504 వరకు పాలించారు. ఈ కాలంలో ప్రసిద్ధ వైష్ణవక్షేత్రమైన తిరుమల తిరుపతులు వైభవోపేతంగా వెలుగొందాయి. సాళువాన్వయులలో ప్రసిద్ధుడు నరసింహరాయలు. మహామండలేశ్వర, మేదిని మీసరగండ, కటారి, సాళువ బిరుదాంకితుడు. 'సాళ్వ' అన్న బిరుదు వీరికి వంశనామంగా నిలిచిపోయినది. తిరుమలలో క్రీ.శ. 1456 నుండి క్రీ.శ. 1500 వరకు సాళువ నరసింహరాయుల, తదనుయాయుల దానశాసనాలు కన్పిస్తాయి.

## అన్నమయ్య-సాళువ నరసింహరాయలు :

అన్నమయ్య సంకీర్తన వాఙ్మయంలో సాళువవంశ్యుల ప్రస్తావన ఎక్కడా కనిపించదు. కాని చిన్నన్న ద్విపద ఆధారంగా మాత్రమే సాళువ నరసింహ రాయల ప్రస్తావన కన్పిస్తుంది. ఇతడు ఇంచుమించు అన్నమయ్యకు సమవయస్కుడు. ఇతని పరిపాలనా కాలం క్రీ.శ. 1486-1491 సంllలని చారిత్రకులు నిర్ణయించారు.

సాళ్వ నరసింహరాయలు 'టంగుటూరు'కు దండనాథుడుగా ఉండేవాడు. టంగుటూరు కడప జిల్లా రాజంపేట తాలూకా 'పొత్తపినాడు' మండలంలో వున్నది. 'తాళ్లపాక' గ్రామం కూడా పొత్తపినాడు మండలంలోనిదే! అందువల్లనే సాళువ నరసింహరాయలు అన్నమయ్య సంకీర్తనలు, మాహాత్మ్యాన్ని గూర్చి వినడం తటస్థించినది.

ఆ వార్తవిని విని యట్టి మహాను
భావునిఁగన బాళిఁబడుచు డెందెమున
..... ..... ..... ..... .....
పరివారవాద్య సంభ్రమము రెట్టింపఁ
యా తాళ్లపాకాన్నమయ్యకు సాగి
చేతులు మొగిచి మచ్చికఁబూజచేసి
శ్రీకృష్ణమన్ననఁగ్రీడి భూచక్ర
మేకచక్రంబుగా నేలినపగిది
నాలాగు మీసహాయము నాకుఁగలుగ
నేలుదు ధరయెల్ల నేకచక్రముగ
నన్ను మన్నించి విన్నప మాలకించి
క్రన్నన మాయూరికడ కేఁగుదెంచి
మాకు బుద్ధులు సెప్పి మాచేయుపూజ
చేకొని మమ్ము రక్షింపరే -

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-31)

అని సాళువ నరసింహరాయలు అన్నమయ్యను వేడుకొంటాడు.

సహజవైష్ణవభక్తి సలిపెడువాని
సహవాసమైన దోసము లేదటంచు -

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-31)

అని అన్నమయ్య కూడా విచారించుకొని సాళువ నరసింహరాయల కోరికను మన్నించి టంగుటూరు చేరుకొంటాడు. నరసింహరాయలు అన్నమయ్యకు టంగుటూరులో వెలసియున్న కేశవమూర్తి ఆలయ సమీపంలో ఒకనగరు నిర్మించి ఇచ్చాడు. సాళువ నరసింహరాయలు అన్నమయ్యను హితునిగా, గురువుగా, బంధువుగా భావించాడు-

పావనుండగు తాళ్లపాకన్నమయ్య
దీవెన లంది వర్ధిలుచు నా రాజు -

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-32)

పెనుగొండరాజ్యానికి ప్రభువైనాడు. రాయలు అన్నమయ్యను టంగుటూరు నుండి పెనుగొండకు రప్పించాడు. ఒకనాడు రాయలు అన్నమయ్యతో-

వెన్నునిపై విన్నవించిన లోక
సన్నుతంబైన మీసంకీర్తనములు

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-32)

వినాలని కోరాడు. అన్నమయ్య రాయల కోరికను మన్నించి-

తేనెలపై తేట తిన్ననివెఱకు
పానకముల నేరుపఱచినమేలు
చక్కెరలో తీపు చల్లఁదెమ్మెరలు
చిక్కని కపురంబు జీవరత్నములు
కలయమృతంబు మీఁగడమీఁది చవులు
చిలుకుచుఁగవులెల్లఁజేయెత్తి మ్రొక్క
సింగార మొకకుప్పఁజేసినరీతి.

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-33)

రంగైన రాగవర్ణములతో కర్ణపేయంగా ఎన్నోసంకీర్తనలు వినిపించాడు. ఆతని సంకీర్తన రచనాప్రతిభకు రాయలు ముదమందాడు. అన్నమయ్యను అనేక విధాలుగా సంభావించాడు.

సాళ్వ నరసింహరాయలు అన్నమయ్యకు పెనుగొండలోనే తన నగరు సమీపంలోనే ఒక నగరు నిర్మింపచేశాడు. వైష్ణవధర్మ వ్యాప్తికి రాజాశ్రయం ఉపకరిస్తుందనే అభిప్రాయంతో అన్నమయ్య కూడా అంగీకరించాడు. పెనుగొండలో నిర్మించిన తన నగరిలో వుంటూ అన్నమయ్య సంకీర్తనల ద్వారా విశిష్టాద్వైత మతవ్యాప్తిచేయసాగాడు.

## రాజధిక్కారం :

అన్నమయ్య పదాలు శ్రుతులై, శాస్త్రములై, వేంకటశైల వల్లభ రతి క్రీడారహస్యాలై కీర్తిని పొందాయి. ఒకనాడు సాళ్వనరసింహరాయలు అన్నమయ్యను కొలువుకు ఆహ్వానించాడు. వేంకటవల్లభునిపై మధురపదాలను వినిపించమని ప్రార్థించాడు. సభలో కవులు విద్వాంసులు, గాయకులు, సామంతులు, దండనాథులు కొలువైవున్నారు. అన్నమయ్య రాజు కోరికను మన్నించి-

ఏమొకొ చిగురుటధరమున యెడనెడఁగస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా ॥

కలికి చకోరాక్షికిఁగడకన్నులు గెంపై తోచిన
చెలువం బిప్పుడిదేమో చింతింపరె చెలులు
నలువునఁబ్రాణేశ్వరుపై నాఁటిన యా కొనచూపులు
నిలువునఁబెరుకఁగ నంటిన నెత్తురు గాదుగదా ॥

పడతికి చనుఁగవ మెఱుఁగులు పైపైఁబయ్యెద వెలుపల
కడుమించిన విధమేమో కనుఁగొనరే చెలులు
ఉడుగని వేడుకతోఁబ్రియుఁడొత్తిన నఖశశిరేఖలు
వెడలఁగ వేసవికాలపు వెన్నెల గాదు గదా ॥

ముద్దియచెక్కుల కెలఁకుల ముత్యపుజల్లుల చేర్పుల
వొద్దికలాగు లివేమో వూహింపరె చెలులు
గద్దరి తిరువేంకటపతి కామిని వదనాంబుజమున
అద్దిన సురతపుఁజెమటల అందము గాదుగదా ॥

(సంపు. 12-సంకీ. 82)

అనే మధురభక్తి సంభరితకీర్తన భావబంధురంగా పాడివినిపించాడు.

పై సంకీర్తన భావవివరణ :

అప్పుడే స్వామిమందిరం నుండి వెడలివచ్చిన నాయికతో చెలికత్తెలు పరాచకాలు ఆడటం ఇందలి వస్తువు.

నాయిక కనుగొనల అరుణిమ, చనుగవ మెఱుగులు, చెక్కిళ్లపై జారిన ముత్యాలజాలరుల వంటి చెమటబిందువులను చెలులు గమనించారు. కారణం ఏమిటని వూహించి చెలిని ఆటపట్టించడం ఇందలి సారాంశం.

నాయిక పల్లవాధరంమీద కస్తురి నిండినది. అది భామిని విభునకు వ్రాసిన పత్రిక యని తలచారు. కలికి కనుగొనలు ఎఱ్ఱబారాయి. వింతలం దాన్ని సంతరించుకొన్నాయి. సతి పతిపై నాటిన కొనచూపులను నిలువుగ పెరికి నప్పుడు అంటిన నెత్తురుగా కనుగొనల ఎరుపును భావించారు. పడతికి చనుగవ మెఱుగులు పయ్యెద చెరగుమించి వ్యాపించాయి. ప్రియుడు

చెలి చనుగవపై ఒత్తిన నఖశశిరేఖలను వెదచల్లిన వేసవికాలపువెన్నెలలని వూహించారు. ముద్దియ చెంపలకు ఇరువైపుల ముత్యాలజాలరుల ఆభర ణాలు అమరి నట్లున్నాయి. అవి వేంకటపతి కామినిని కౌగిటచేర్చి అద్దిన సురతపు వేళల చెమటల అందమని తలపోశారు.

దివ్యపంతులు అలమేల్మంగా, శ్రీనివాసుల రతిపారవశ్యాన్ని తద్రైక్యాన్ని అన్నమయ్య మధురసంకీర్తనగా వినిపించాడు. సాళువ నరసింహరాయులు 'ఇది కవిత్వం'బని మెచ్చి-

అనుపమంబైన ద్రోణాచార్య మహిమ
గనియుఁద్రౌపదితండ్రి గర్వించివటుల.

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-36)

అన్నమాచార్యుని మహత్త్వమంతయు వినికూడా

'పదరక వేంకటపతిమీఁద నుడువు
పదముల రీతి నాపై నొక్కపదము
చెప్పుమా...... అని అన్నమయ్యను కోరాడు.

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-36)

వెంటనే అన్నమయ్య-

..... ..... ..... ..... చెవు లిరుగేల-
వప్పళింపుచు మూసి హరిహరీ యనుచు
పరమపతివ్రతాభావంబుఁబూని
హరి ముకుందునిఁగొనియాడు నా జిహ్వ
వినుఁగొనియాడంగ నేరదు'

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-37)

అని-

గరిమల వెరఁగరుగాక మానవులు
సిరులఁదియ్యని నోరఁజేఁదు మేసేదా ॥
హరి నారాయణ యనియెడి నోరను
ధర నితరుల పేళ్లు దడవుటెట్టు

పరవితో వేదములు చదివేటి నోరను
పరులమీఁది పదాలు పాడేదా॥

(సంపు-3-సంకీ- 456)

నరహరి కీర్తన నానిన జిహ్వా
వొరుల నుతింపఁగ నోపదు జిహ్వా

(సంపు-2-సంకీ-144)

అని పరిపరివిధాల తలపోసి నరసింహరాయల యొక్క నైచ్యపు పలుకులకు ఖిన్నుడై రాజాశ్రయంలో లభించే భోగాలను

పల్లకీలు నందలాలు పడివాగె తేజీలు
వెల్లివిరి మహాలక్ష్మి విలాసములు
తల్లియాకె మగనినే దైవమని కొలిచేము
వొల్లఁగే మాకేసిరులు వొరు లియ్యవలెనా.

(సంపు-10-సంకీ-94)

అని రాజుకు తేటతెల్లం చేసి అన్నమయ్య సభనుండి నిష్క్రమించాడు. నరసింహరాయుడు ఈ ధిక్కారాన్ని సహించలేకపోయాడు. భటులచే అన్నమాచార్యుని బంధింప చేశాడు. అన్నమయ్యకు మూరురాయ గండ సంకెలవేయించి చెరసాలలో బంధించాడు. అంత అన్నమయ్య-

ఆఁకటివేళలను నలపైన వేళలను
తేఁకువ హరినామమే దిక్కు మరిలేదు ॥

కొఱమాలి వున్నవేళ కులము చెడినవేళ
చెఱవడి వొరులచే జిక్కినవేళ
ఒఱపైన హరినామ మొక్కటే గతిగాక
మఱచి తప్పిననైన మరిలేదు తెరఁగు.

పంకెళఁబెట్టినవేళ చంపఁబిలిచినవేళ
అంకిలిగా నప్పుల వారాఁగినవేళ
వెంకటేశు నామమే విడిపించ గతిగాక
మంకుబుద్ధిఁబొరలిన మరిలేదు తెలుఁగు ॥

(సంపు. 1- సంకీ-158)

అని ఆర్తత్రాణపరాయణుడైన శ్రీవేంకటవిభుని ప్రార్థించగా సంకెళ్లు వీడి పోతాయి. భటులు ఈ విషయం రాయలకు తెలిపారు. రాజు మిత్రత్వాన్ని మరచి తిరిగి సంకెల వేయించాడు. అన్నమయ్య తీరని ఆవేదనతో--

నీ దాసుల భంగములు నీవు చూతురా
యేదవి చూచేవు నీకు నెచ్చరించవలెనా

(సంపు.3-సంకీ-266)

అని స్వామిని వేడగా శృంఖలలు వూడిపోయాయి. రాజు ఈ చర్యకు భయభ్రాంతుడై అన్నమయ్య చరణాబ్జములకు సాగిలిమ్రొక్కి-

అపరాధి నపరాధి నన్నమాచార్య
కృపఁజూడు నను నీవు కృపణశరణ్య

నీ వలిగిన నల్గు నీలవర్ణుండు
నీవు మెచ్చినమెచ్చు నీరజోదరుఁడు
నాయర్థమంతయు నన్నమాచార్య
నీయందె కంటిమి నిక్కంబు గాఁగ
నని పట్టమహిషితో .....

(అన్న. చరిత్ర.ద్విపద-పుటలు-39,40)

అన్నమయ్యను వేడుకొని రాచమర్యాదలతో ఆదరించాడు. అన్నమయ్య రాజును క్షమించి-

ధ్యాయన్ కృతే యజన్ యజ్ఞై స్త్రేతయాం ద్వాపరేఽర్చయన్,
యదాప్నోతి తదాప్నోతి కలౌ సంకీర్త్య కేశవమ్,

(విష్ణుపురాణం)

కృతయుగంలో ధ్యానంవల్లను, త్రేతాయుగంలో యజ్ఞయాగాదుల వల్లను, ద్వాపరంలో అర్చనాదులవల్లను, కలియుగంలో హరి సంకీర్తనలవల్లను జనులు ముక్తి పొందుతారు.

హరిభక్తులను సేవించు. భాగవతావమానం భగవదవమానాన్ని మించి నదని రాయలకు ఉద్బోధిస్తాడు. రాజాశ్రయంవీడి తిరుమలకేగి స్వామికి 'శృంగారమంజరి'ని సమర్పించాడు.

అన్నమయ్య రచించిన లఘుకృతుల్లో లభ్యమైన వాటిలో ఇది ఒకటి. తాళ్లపాకవారు ద్విపదప్రక్రియలోనే కాక ద్విపదభేదమైన మంజరీద్విపదలో కూడా రచనలు చేశారు. మనకు ఉపలబ్ధములైన తాళ్లపాక మంజరులు-

1. శృంగారమంజరి

2. సుభద్రాకళ్యాణము (తాళ్లపాక తిమ్మక్క)

3. చక్రవాళమంజరి (పెదతిరుమలయ్య)

శృంగారమంజరి 517 పంక్తులు గల మంజరీ ద్విపదకావ్యం. స్వామిపై మరులుగొన్న ఒకబాలిక విరహావస్థను అనుభవించి ఆపై స్వామి సన్నిధిని చేరడం ఇందలి వస్తువు. మనోజ్ఞమైన రచనా సంవిధానంతో కూడుకొన్న నిందురచన.

అన్నమయ్య తిరుమలలో స్వామికి మధురభక్తి పరమైన శృంగార సంకీర్తనలు ఎన్నో వినిపించాడు. అన్నమయ్య భావనాచమత్కృతికి మరుగురుడు తన్మయుడై-

జగతి వీ శృంగార సంకీర్తనముల
కగపడి మంచి ప్రాయపువాఁడ వయితి
వవి వేంకటేశ్వరుఁడన్నమాచార్యుఁ
గనుగొని వాక్రుచ్చి, - గారవించాడు.

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-42)

తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రతి సంవత్సరం జరిగే బ్రహ్మోత్సవాల్లో అన్నమయ్య పాల్గొనేవాడు. అంతేకాక దేశసంచారము చేసి అనేక క్షేత్రమూర్తులపై ఎన్నో సంకీర్తనలు రచించాడు. అన్నమయ్య దర్శించిన క్షేత్రమూర్తులను గూర్చి, ఉత్సవాది విశేషాదులను గూర్చి ప్రత్యేకంగా ప్రస్తావించబడుతుంది.

## అన్నమయ్య మహిమలు :

అన్నమయ్య-

..... ..... ..... ఆ శ్రీశైలవాథు
పావనవినుతి ప్రభావంబుచేత
జగతిపై సకలవాచా శుద్ధికలిగి

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-42)

జీవనం సాగిస్తుండేవాడు. అతని నోటివెంట వచ్చినమాట అక్షరాల జరిగేది. ఒకరోజు స్వామికి నైవేద్యంగా మామిడిపళ్లను సమర్పించి తాను ఆరగించగా పండ్లుపుల్లగా వున్నాయి-

అమృతంబు తోఁబుట్టువగు పద్మమోవి
వమృతంబు తవివోవ నాము వెమ్మవికి.

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-43)

జీడిపులుసుకాయలు సమర్పించానని బాధచెందాడు. వెంటనే ఆ జీడిమామిడి చెట్టును తాకి 'దీని పళ్ళు తియ్యనిపళ్ళు అగుగాక' అని వేంకటపతిని ప్రార్థించాడు. ఆ జీడిమామిడిపళ్లు తియ్యనిపండ్లు అయ్యాయి. ఈ సన్నివేశాన్ని స్ఫురింపచేసే కీర్తన కూడా కందు.

కరము జీడిపులుసు గలిగిన మామిడి కరము పోకినయంతనే
పరవిఁజక్కెరవలెఁజవిగలిగించువాని చవవరి సుతుఁడితఁడే ।

(అన్న. చరిత్ర. పీఠిక-పుట-65)

ఇలాగే ఒక పేదబ్రాహ్మణుఁడు తన కొమార్తె వివాహానికి అన్నమయ్యను ధనం అర్థించాడు. అన్నమయ్య వశ్యవాక్కువల్ల ఒక

రాజు ఆ బ్రాహ్మణకన్య పరిణయానికి ధనం సమకూరుస్తాడు. ఇలా అన్నమయ్య మహిమలను తెలుసుకొని జనులు--

"చెలువొందు నాగురు శ్రీపాదరక్ష
తలవిడి తమ యాపదల వీడికొవిరి"

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-44)

## అన్నమయ్య-పురందరదాసు:

అన్నమయ్య ద్విపద ఆధారంగా మనకు తెలుస్తున్న మరొక ప్రధాన ఘట్టం అన్నమయ్య పురందరదాసుల చెలిమి. అన్నమయ్య - పురంద రదాసుల చెలిమిని గూర్చి ప్రస్తావించడానికి ముందు తెలుగు, కన్నడ దేశాల రాజకీయ, సాహిత్యపరమైన పరస్పర అనుబంధాన్ని గూర్చి, హరిదాస కూటమిని గూర్చి ప్రస్తావించడం సమంజసం.

అన్నమయ్య సంకీర్తనలలో వైష్ణవ సంప్రదాయమే కాకుండా విఠలారాధన సంప్రదాయం కూడా కన్పిస్తుంది.

తెలుగు, కన్నడ సాహిత్య సంప్రదాయాల అనుబంధం అనాదిగా వున్నదే! దీనికి కారణాలు:

1. తెలుగు-కన్నడదేశాలు నైసర్గికంగా ఒకే భూభాగాన్ని అంటి పెట్టుకొని వుండడం.

2. తెలుగు, కన్నడ భాషలు ఒకే భాషాకుటుంబానికి చెందినవి కావడం.

3. రాజకీయంగా ఈ రెండుదేశాలను పల్లవులు, చాళుక్యులు, విజయనగరాధిపతులు పాలించడం కారణాలుగా చెప్పవచ్చును. విజయ నగర చక్రవర్తులు శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులు కావడంవల్ల కన్నడిగు లకు తిరుపతితో అనుబంధం పెరగడానికి వీలైంది. సాళ్వ నరసింహ రాయల కాలంలోనే అన్నమయ్య పదాలు విజయనగర ప్రాంతంలో వ్యాప్తిని పొందాయి. విజయనగరాధీశుల కాలంలో కర్ణాటాంధ్రప్రాంతాలు రెండూ కలసిమెలసి వుండేవి.

క్రీ.శ. 11వ శతాబ్దంలో కన్నడదేశంలో నరహరితీర్థులచే అంకురార్పణ చేయబడిన హరిదాసకూటమిని క్రీ.శ. 15వ శతాబ్దంలో శ్రీపాదరాయలు పరిపుష్టం చేశాడు. తదుపరి వైష్ణవభక్తి తత్త్వాన్ని, కర్ణాటక హరిదాస సంప్రదాయాన్ని దేశం నలువైపులా వ్యాపింపచేసినవాడు పురందరదాసు. ఇతని కాలం క్రీ.శ. 1484-1564 అని, క్రీ.శ. 1470-1564 అని భిన్నాభిప్రాయాలున్నాయి. పురందర దాసు అన్నమయ్యను వార్ధకంలో దర్శించాడని చెప్పవచ్చు. అన్నమయ్య మహామహిమాన్విత కవితాశక్తిని, భక్తి తత్పరతను విన్న పురందరదాసు అన్నమయ్యను దర్శించడానికి తిరుమలకు వచ్చాడు. అన్నమయ్యను దర్శించి సాక్షాత్తు వేంకటేశ్వరుని అవతారమని స్తుతించాడు. అన్నమయ్య దాసులవారిని కౌగిలించుకొని 'నీవు సంధ్యవార్చుకోవడానికి ఆ స్వామితోనే నీళ్ళు తెప్పించుకొన్న భాగ్యశాలివి' అని, 'విఠలుని అవతార'మని కీర్తించాడు.

అన్నమయ్య 32,000 పదాలు రచించగా, పురందరాసు 4,75,000 పదాలు రచించాడని కన్నడ పండితుల అభిప్రాయం. అన్నమయ్య పురందరదాసుల కీర్తనల్లో భావసామ్యాలుగల అనేక కీర్తనలు కన్పిస్తాయి. కొన్ని ఉదాహరణలు-

అన్నమయ్య :

తివరావి కొనరాని దేవలోకపుఁబండు
మనసున తలఁచితే మలిగించే పండు.

[సంపు 13-సంకీ-284]

పురందరదాసు :

హణ్ణు బందిదె కొళ్ళిరో నీవీగ
చిన్న బాలకృష్ణ నెంబో చన్నె బాళె.

(కీ. 732)

అన్నమయ్య :

ఊరకే దొరకునా వున్నతోన్నత సుఖము

(సంపు-2. సంకీ-104)

పురందరదాసు :

సుమ్మనే బరువుదే ముక్తి

(కీ. 79)

అన్నమయ్య :

పొరకుమీవో మనసా
సంతము విడువకు మీ మనసా

(సంపు-2- సంకీ-177)

పురందరదాసు :

బేడ మనవె బేడి కొంబెనో నాను
కొడదిరు కపటది మనవె

(కీ. 633)

అన్నమయ్య :

అదిగో విజయనగరమందు వాడల వాడల
వెరజల్లె వరములు విట్ఠలుఁడు

(సంపు-3-సంకీ-229)

పురందరదాసు :

శరణు వినగె శరణెంబరు విఠల
కరుణ వారిధి ఎన్నకాయె విఠల

(కీ. 543)

## అన్నమయ్య రచనలు :

యోగమార్గంబున నొక కొన్ని బుధులు
రాగిల్ల శృంగారరసరీతిఁగొన్ని
వైరాగ్యరచనతో వాసింపఁగొన్ని
పారసన్నేతుపై సంకీర్తనములు

పరసత్వమునఁదాళపముఖముల్ గాఁగ
పరమతంత్రములు ముప్పదిరెండువేలు
ప్రవిమల ద్విపద ప్రబంధరూపమున
నవముగా రామాయణము, దివ్యభాష
నా వేంకటాద్రి మాహాత్మ్య మంతయును
గావించి, రుచుల శృంగారమంజరియు
శతకముల్ పదిరెండు సకలభాషలను
ప్రతిలేని నానా ప్రబంధముల్ చేసి ॥

(అన్న. చరిత్ర.ద్విపద-పుట 45-46)

సిరివరుని మెప్పించాడు. ఇందులో మనకు లభ్యమైనవి దాదాపు 14,000 సంకీర్తనలు, శృంగారమంజరి, శ్రీ వేంకటేశ్వర శతకాలు మాత్రమే! మిగి లిన రచనలు-ద్విపదరామాయణం, సంస్కృత వేంకటాద్రి మాహాత్మ్యం, పదకొండు శతకాలు, ప్రబంధాలు కాలగర్భంలో కలసిపోయాయి.

## అన్నమయ్య పదకవితారీతులు :

అన్నమయ్య పదకవితారీతుల్ని చర్చించడానికి ముందు క్రీ.శ. 15వ శతాబ్దం నాటి ఆంధ్రవాఙ్మయచరిత్రను, రాజకీయవ్యవస్థను గూర్చి పరిశీలిద్దాం.

ఆంధ్రవాఙ్మయచరిత్రలో క్రీ.శ. 15 శతాబ్దము ప్రబంధయుగం. అష్టాదశవర్ణనలు, రసాలంకారాది విశేషాలు, వ్యంగ్య వైభవం, కవితా చమ త్కృతులతో నిండిన ప్రబంధాలు వెలువడుతున్న కాలం. రాజకీయంగా పరికిస్తే మహమ్మదీయుల దండయాత్రలతో ఛిన్నాభిన్నమైన మతవ్యవస్థ. ఇలాంటి సమయంలో వైష్ణవమత ప్రాశస్త్యాన్నిచాటే సాహిత్యాన్ని సుస్థిరం చేయడంకోసం అన్నమయ్య పదప్రక్రియను చేపట్టినట్లు వెల్లడవుతున్నది.

అన్నమయ్య మహాభక్తుల కోవకు చెందినప్పటికీ కేవలం స్తోత్ర ప్రాయ ములైన భక్తి పాటలు పాడినవాడు కాదు. సంగీతవేత్త అయినప్పటికి నాదప్రధానమైన రచనలే సాగించినవాడు కాదు. మహాకవి అయినప్పటికి

కావ్యాలే అల్లినవాడుకాడు. భక్తుడు, గాయకుడు, కవి అయిన అన్నమయ్య రాశిలో, వాసిలో మిన్నయైన భావ ప్రధానరచనలు చేసినవాడు. ఆంధ్ర వాఙ్మయచరిత్రలో పదప్రక్రియకు ఒక నిర్దుష్టమైన స్థానం కల్పించి 'పదకవితా పితామహుడ'నే ప్రశస్తిని పొందినవాడు.

అన్నమయ్య సంకీర్తనలలో అధికములు శృంగారరస ప్రధానములు. కొన్ని ఆధ్యాత్మకాలు.

## అధ్యాత్మ సంకీర్తనలు :

అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలను గూర్చి చినతిరుమలయ్య-

పావనములు హరిభక్తి వి
భావనములు సర్వమంత్ర పరమ రహస్యో
ద్భావనములు గాయక విక
రావనములు తాళ్లపాక యన్నయ పదముల్.

(సంకీర్తనలక్షణం-పద్యసంఖ్య-3)

దేహాత్మేశ వివేకో
త్సాహంబును లోకవేద ధర్మాధర్మా
ద్యూహా పోహంబులుఁగల
యా హరి సంకీర్త నంబు లధ్యాత్మంబుల్.

(సంకీర్తన లక్షణం-పద్యసంఖ్య-64)

అని సంకీర్తనలక్షణ గ్రంథంలో వివరించాడు.

భగవద్భక్తితత్త్వాన్ని అనేకవిధాలుగా సంకీర్తనల్లో పొందుపరిచాడు అన్నమయ్య. నిష్కామకర్ముడై శ్రీవేంకటేశునిపై అచంచలమైన భక్తి విశ్వాసంతో ప్రబోధాత్మకములైన సంకీర్తన లెన్నింటినో రచించాడు. భాగవతంలో పేర్కొన్న నవవిధభక్తి భేదాలను ఈ సంకీర్తనల్లో ఉదాహరించాడు. వేదప్రమాణాలను, పరతత్త్వాన్ని, దేహ-దేహి అనుబంధాన్ని, శరణాగతిని, మాయాతత్త్వాన్ని, పరంజ్యోతిస్స్వరూపాన్ని అనేక విధాలుగా కీర్తించాడు.

మచ్చునకు కొన్ని సంకీర్తనలు :

సర్వభోగాలను అనుభవించిన పిమ్మట పరతత్త్వచింతనకు ప్రయత్నించడం అవివేకం.

సముద్రే శాన్తకల్లోలే స్నాతు మిచ్ఛతి మూఢధీః
తథైవ శాన్తే సంసారే జ్ఞానమిచ్ఛతి దుర్మతిః.

అనే సూత్రార్థ ప్రకాశికలోని భావాన్ని -

కడ లుడిపి నీరాడఁగాఁదలఁచు వారలకు
కడలేవి మనసునకుఁగడమ యెక్కడిది
(సంపు. 11-3-సంకీ-97)

అని సులభంగా బోధించాడు.

సంసార జంబాల పటలిలో చిక్కుకొన్న జీవికి భగవత్స్వ రూపాన్ని తెలుసుకోవడం అసాధ్యమే! భగవత్స్వరూపాన్ని సతతసత్యవ్రతులు, సంపూర్ణ మోహవిరహితులు మాత్రమే తెలుసుకోగలరని--

ఇతరులకు నిను నెఱఁగఁదరమా
సతత సత్యవ్రతులు సంపూర్ణమోహ విర
హితు లెఱుంగుదురు నిను నిందిరా రమణా.
(సంపు.1-సంకీ-252)

అని కీర్తిస్తాడు.

జీవునిరక్షణ దేవునియొక్క కర్తవ్యమే అని-

సొమ్ముగలవాఁడు తన సొమ్ము చెడనిచ్చునా
కమ్మి నీ సొమ్మను నేను కాపాడవే హరి. (సంపు-3,సంకీ-437)

అని తేటతెల్లం చేశాడు.

కర్మబంధాన్ని తప్పించుకోవడం భగవంతునికికూడా తప్పదని-

సామాన్యమా పూర్వసంగ్రహంబగు ఫలము
వేమమునఁబెనగొనియె నేఁడు నీవనక ॥

జగతిఁబ్రాణులకెల్ల సంసారబంధము
తగుల బంధించు దురితంపుఁగర్మమున
మగుడ మారుకు మారు మగుడ నీ వురముపై
తెగి కట్టి రెవ్వరో దేవుండ వనక. (సంపు-11-3-సంకీ-71)

అని చమత్కరిస్తున్నాడు.

అన్నమయ్య నిశ్చల మనస్కుడై భగవంతుని పరిపరివిధాల ఆరాధించి తరించాడు. అందుకే సకలశాంతికరము సర్వేశ నీపై భక్తి (3-377); నాకేల విచారము నాకేల యాచారము (3-384), హీనుఁడ నే నధికుఁడ వన్నిటానీవు (2-433), నిత్య సుఖానందమిదె నీ దాస్యము (10-78) మొదలుగా అనేక ప్రబోధాలను మానవాళికి అందించాడు.

అన్నమయ్య సంకీర్తనలు 'ద్రవిడవేదాంతమ'ని కీర్తింపబడుతున్న ఆళ్వారుల పాశురాలతో సరిపోల్చదగినవి. వైష్ణవభక్తి సాహిత్యంగా ఆళ్వారులు వెలయించిన ద్రవిడవేదాన్ని అన్నమయ్య అనేక సంకీర్తనల్లో నిక్షేపించాడు.

## శృంగార సంకీర్తనలు :

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని పరతత్త్వంగా భావించి శృంగారభక్తి భావనలో ఎన్నో వేల కీర్తనలు రచించాడు. అశాశ్వతమైన లౌకికవిషయాలను విడిచి పరమార్థమునందే మనసు నిలిపి సోపానక్రమంగా పరమాత్మయందు తన్మయీభావం పొందడమే మధురభక్తి లక్ష్యం. వైష్ణవంలో గోపికాభక్తి ప్రసిద్ధమైనది. 'పుమాన్ విష్ణు రితి ఖ్యాతః స్త్రీప్రాయ మితరం జగత్" అన్న వైష్ణవసంప్రదాయాన్నే అన్నమయ్య అవలంబించినాడు. వీరి పద రాశిలో జీవాత్మ పరమాత్మసంయోగానికై పరితపించడం అనేక విధాలుగా ఉల్లేఖించబడింది. దీనికి కారణం-

'సామాన్యజనులు తత్త్వదృష్టితో దైవమును చూచి కొలిచి తరించుట వలనుగాని పని. వారి వారి అనుభవములకు తగిన శృంగారలీలలనైతే మధురముగ చేపట్టి పాడుకొనగలరు. అందుకనియే అన్నమయ్య శృంగార దృష్టితో నైన వేంకటేశ్వర నామాంకిత కీర్తనసాగించి కృతార్థులగుదురు గాక యని గుడజిహ్వికా న్యాయముతో ఈ శృంగార సంకీర్తనలరాశిని పెంచినట్లున్నది' అన్న శ్రీగౌరిపెద్ది రామసుబ్బశర్మగారి మాటలు ఇట అనుసంధించ తగియున్నవి.

(శృంగార సంకీర్తనలు-12 సంపుటం, పీఠిక పుట-24)

అన్నమయ్య శృంగార సంకీర్తనలు సంయోగాన్ని వర్ణించిన పట్టుల సంయోగాంతముగా ముగించడం సహజమే! విప్రలంభ సంకీర్తనలు కూడా ఏదో ఒక విధంగా చరమచరణంలో సంయోగాంతముగానే సమాప్తమవు తాయి. కీర్తనలందు సైతం స్వామితోడి దీర్ఘకాలిక వియోగాన్ని సహింపలేని చిత్తవృత్తి అన్నమయ్యది.

అన్నమయ్య శృంగారసంకీర్తనల్లో అష్టవిధ నాయికాభేదాలు, సంభోగ విప్రలంభ శృంగార వర్ణనలు విశేషంగా చోటుచేసుకొన్నాయి. ఉదా :

ఇదిగాక సౌభాగ్య మిదిగాక తపము మఱి
యిదిగాక వైభవం బిఁక నొకటి కలదా ‖

అతివజన్మము సఫలమై పరమయోగివలె
వితర మోహాపేక్షలిన్నియును విడిచె
సతికోరికలు మహాశాంతమై యిదె చూడ
సతత విజ్ఞాన వాసనవోలె నుండె.

(సంపు. 12-సంకీ-17)

ఆనే సంకీర్తన అలౌకిక శృంగారపరమార్థాన్ని వివరించే మధుర సంకీర్తన. నాయిక స్వామితో తాదాత్మ్యం చెందడానికి చేస్తున్న ప్రయత్నమిది. జీవాత్మ పరమాత్మవిషయకమై పొందుచున్న ఆనందము అనంతము, దివ్యమని నాయికాపరంగా వెల్లడించబడినది.

అలమేల్మంగా శ్రీనివాసుల దివ్యలీలా వైభవాలను మధుర మనోజ్ఞ భావంతో ఎన్నోవేల శృంగార సంకీర్తనలుగా రచించి తరించిన ధన్యజీవి అన్నమయ్య.

## అన్నమయ్య పదాల్లోని దేశికవితలు :

నానావిధ దేశంబుల
నానా కవిబుద్ధి వర్ణనా రచనలచే
మానిత తానక రాగము
తో వలరున్ దేశిపదము దొరలకు మెచ్చై.

(సంకీర్తన లక్షణగ్రంథం-పద్యసంఖ్య-68)

ఏ వాఙ్మయంలోనైనా పద్యంకంటె పదమే ముందు పుట్టిందనడం నిర్వివాదాంశం. జనపదులు కష్టసుఖాల్లో భావావేశాలకు లోనయినపుడు వారిగుండె లోతుల్లోంచి అప్రయత్నంగా వెలువడే పాటలే జానపదగేయాలు. జానపదగేయాలు సులభశైలిలో సాగే రచనలు. అన్నమయ్య ప్రధానోద్దేశ్యం సామాన్యుల్లో వైష్ణవమతం ప్రచారంచేయడం. ఇందుకు భాష, భావం ఆలంబనాలు. భాగవత తత్త్వాన్ని సామాన్యులకు తెలిపే ప్రయత్నంలో అన్నమయ్య పదాల్లో అనేక విధాలైన జానపదరీతులు చోటుచేసుకొన్నాయి.

### అన్నమయ్యకు పూర్వపు దేశికవిత్వం :

నన్నయ భారతంలో దేశిచ్ఛందోరీతులైన తరువోజ, మధ్యాక్కరలు కనిపిస్తాయి. నన్నెచోడుని కుమారసంభవంలో ఈశ్వరుని అంకమాలికలు, ఉవిదలింపు మిగుల వూయల పాటలు (4-89), ఆలతులు (4-112), గౌడుగీతాలు (6-85), రోకటి పాటలను (6-87) ప్రస్తావించాడు.

పాల్కురికి సోమన (క్రీ.శ. 12 శతాబ్ది) పండితారాధ్య చరిత్రలో తుమ్మెద, ప్రభాత, పర్వత, ఆనంద, శంకర, నివాళి, వాలేశు, గొబ్బి, వెన్నెల పదాలను, బసవపురాణంలో కోలాటం, చాంగుబళా, జోలపదాలను పేర్కొన్నాడు.

కృష్ణమాచార్యుడు దేశిరీతికి చెందిన అనిబంధపదాలను రచించినవాడు. అతని రచనలైన వచనసంకీర్తనం తులసీమాహాత్మ్యం, నృసింహవచనాలు, రామనామసంకీర్తనలు, తర్వాతి వాగ్గేయ కారులకు మార్గదర్శక మైనాయి.

క్రీ.శ. 14వ శతాబ్దంలో నాచనసోమన వసంతవిలాసంలో జాజరపాట లను ప్రస్తావించాడు. పోతన భాగవతంలో బాలు నంకించి పాడే పాటలను (10-355), గోవిందుమీది పాటలను (10-505) ప్రస్తావించాడు. శ్రీనాథుడు భీమేశ్వరపురాణంలో యక్షగానసరళిని పేర్కొన్నాడు. అన్న మయ్య కాలానికి పూర్వం కనిపించే లిఖిత పూర్వక జానపద వాఙ్మయం ఇదే.

దేశికవితా ప్రక్రియకు చెందిన మేలుకొలుపు, సువ్విపాటలు, అల్లో నేరేళ్లు, గొబ్బి, జాజర, సోది, తుమ్మెద, చిలక, తందానలు, ఏల, కోలాటం, చందమామ, శోభనం, హారతి, నివాళి, ధవళ, ఉయ్యాల, లాలి, జోల, మంగళ, సాసముఖాలు, కూగూగులు, తాత్త్వికాలు, చాగుబళాలు - ఇవేకాక బాలక్రీడాసంకీర్తనలు, దివ్యనామ సంకీర్తనలు, వృత్త్యాత్మక సంకీర్తనలు, కులవాచక గేయాలు, ఉత్సవ సంకీర్తనలు మున్నగు జానపదగేయఫణితులు అన్నమయ పదవాఙ్మయంలో కన్పిస్తాయి.

ఉదాహరణకు కొన్నిగేయాలు-

మేలుకొలుపు :

మిన్నక వేసాలుమాని మేలుకోవయ్యా
పన్నల వీయోగవిద్రచాలు మేలుకోవయ్యా.

(1-374)

కోలాటం :

వెట్టివలపు చల్లకు విష్ణుమూరితి వాతో
వెట్టదీర మాటాడు విష్ణుమూరితి.

(21-241)

దశావతారగేయాలు :

పదియుఁబదియుఁగాను పరమాత్ముఁడితనికి
వెదకి చవులు దెచ్చి విందులిట్టి పేయరే.॥
పొలసుపైఁబారెనట బురద మే నంటెనట
యిలమన్ను మోచెనట యీ దేవుఁడు
వెలపైన రాకాపి వెత్తుటఁదోఁగినాఁడట
కల పన్నీరెల్లఁబోపి కడుగరే దేహము.

(25-335)

చాగు - బళా :

చక్కనితల్లికి చాఁగుబళా తన
చక్కెర మోవికి చాఁగుబళా.

(12-107)

శోభనం :

పాడరే సోబనాలు పడఁతులాల
వేడుక లిద్దరికి వెలపెఁజాడరే.

(24-436)

హారతులు :

అంగన లీరే యారతులు
అంగజ గురునకు నారతులూ.

(25-346)

బాలక్రీడా సంకీర్తనలు :

బండి విరిచి పిన్నపాపలతో వాడి
దుండగీడు వచ్చె దోబూచి.

(12-227)

దివ్యనామ సంకీర్తనలు :

భగవంతుని నామం ఒక్కటే దివ్యనామం. భగవన్నామాన్ని పాదాంతంలోగాని లేదా చరణాంతంలోకాని వుంచి భక్తులు సామూహికంగా కీర్తించడానికి అనువయినవి దివ్యనామ సంకీర్తనలు.

పాల్కుర్కిసోమన పండితారాధ్య చరిత్రలో శంకరపదాలను పేర్కొన్నాడు. ఆంధ్రవాగ్గేయకారుల్లో ప్రథముడని చెప్పదగ్గ కృష్ణమాచార్యులు రామనృసింహనామాలు వ్రాసినవాడే!

భగవంతుని దివ్యనామాలను అన్నమయ్య అనేక సంకీర్తనలలో రచించాడు . చతుర్వింశతి కేశవాదినామాలు, రామ, హనుమంత, చెన్నకేశవ, విఠల మొదలైన దివ్యనామ సంకీర్తనలు వీరి సాహిత్యంలో చోటుచేసుకొన్నాయి.

మచ్చునకు రెండు సంకీర్తనలు :

నమో నమో లక్ష్మీనరసింహ
నమో నమో సుగ్రీవ నరసింహ (2-348)

సంతగాఁడు మిక్కిలి నీ పవనజుఁడు
రంతుకెక్కె మతంగపర్వత పవనజుఁడు (10-273)

వృత్యాత్మక సంకీర్తనలు :

అన్నమయ్య పండిత పామరజనరంజకుడైన వాగ్గేయకారుడు. భక్తి తత్త్వాన్ని ప్రచారం చేయడంకోసం దేశసంచారం చేశాడు. జానపదులను ఆకట్టుకోవడం కోసం కొన్ని వృత్యాత్మక గేయాలు వ్రాశాడు.

మచ్చునకు కొన్ని కీర్తనలు :

వ్యవసాయం :

పంటల భాగ్యులు వీరా బహు వ్యవసాయులు
అంటి ముట్టి యిట్లఁగాపాడుదురు ఘనులు. (3-359)

వర్తకం :

వాడల వాడల వెంట వాఁడివో వాఁడివో
వీడ నుండి చీరలమ్మే నేఁత బేహారి (1-275)

గొల్లెత :

కుందణంపు మై గొల్లెత తా
నెందును బుట్టని యేతరి జాతి (12-92)

వైద్యం :

కొనరో కొనరో మీరు కూరిమి మందు
వునికి మనికికెల్ల నొక్కటే మందు (1-237)

కులవాచకాలు :

పొడవైన శేషగిరి బోయనాయఁడు
విడువ కిందరిఁగాచు వెడబోయనాయఁడు (1-460)

ఈ విధంగా అన్నమయ్య పదాల్లో వివిధ జానపదగేయరీతులు చోటుచేసుకోవడానికి కారణం అతడు దేశపర్యటనమొనర్చి జనజీవన సాహిత్యాన్ని బాగా ఆకళింపు చేసుకోవడమే!

## భాషావిశేషాలు :

అన్నమయ్య శిష్టవ్యవహారం, సామాన్య ప్రజావ్యవహారంలో ఉన్న భాషకు, గ్రాంథికానికి మూడింటికీ ప్రాధాన్యం ఇచ్చాడు. పండితుల్ని మెప్పించడానికి సంస్కృతంలో కొన్ని కీర్తనలు, వేంకటాచల మాహాత్మ్యం రచించాడు. శిష్టులకు ప్రీతి కలిగించడానికి శిష్టవ్యావహారిక భాషను, జానపదుల్ని అలరించడానికి గ్రామ్య భాషను సంకీర్తనల్లో ఉపయోగించాడు.

అన్నమయ్య పదాల్లో పామరభాష ప్రథమస్థానాన్ని ఆక్రమించినది. వ్యావహారిక పదప్రయోగానికి 'ఉచ్చారణ' ప్రాణం లాంటిది.

మచ్చునకు కొన్ని ప్రయోగాలు :

గవము (24-21), వాయిదాలు (17-403), కాపిరాలు (29-210), రుకిమిణి (26-233), పొస్తకాన (14-386) మొదలైన వ్యావహారిక పదాలు;

ఈరుఁదియ్యఁబేను వచ్చు (29-260), తల్లికి లేని ముద్దు దాదికా (8-163), ఉప్పు చిందినుమడించె (13-463), కట్టువదలిన క్రేపు (12-75), రొమ్ము నకుంపటి (18-373), చేపట్టుకుంచము (10-176) వంటి జాతీయాలు;

అంగళ్లుముంగిళ్లు (14-162), అనలు కొనలు (2-118), ఒఱపో మెఱపో (12-129) , చింతలు సిలుగులు (3-126) వంటి జంటపదాలు;

కన్నుల మొక్కు (24-472), వలపుబండ్ల వచ్చు (26-221), అట్టలు గట్టినవ్వు (15-178), కారపు బొంకులు (26-257), వలపుగంపఁబెట్టు (26-18) మొదలైన సజీవభావబంధుర ప్రయోగాలను గ్రంథస్థం చేసిన ధన్యజీవి అన్నమయ్య.

## దేశసంచారం :

ఆంధ్రవాగ్గేయకారుల్లో అనేక దివ్యస్థలాలను సందర్శించిన ఘనత తాళ్ళ పాక అన్నమయ్యదే! అన్నమయ్య ప్రధానంగా రాయల సీమలోని కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలను; గుంటూరు, నెల్లూరు జిల్లాలను, కర్ణాటకలోని కలశాపురం, మతంగాద్రి, విజయనగరం; తమిళనాడులోని కంచి, శ్రీరంగం, చిదంబర క్షేత్రాలను దర్శించాడు.

రాయలసీమలో కర్నూలు జిల్లాలో వెలసియున్న అహోబలనృసింహుని, చాగలమర్రి, వెలిగోడులలో వెలసియున్న చెన్న కేశవుని;

అనంతపురంజిల్లాలో కదిరి నృసింహుని, గుత్తి రఘురాముని;

కడపజిల్లాలో ఓగునూతల నృసింహుని, ఒంటిమిట్ట కోదండ రాముని, కోన చెన్న కేశవుని, గాలివీడు వేంకటేశ్వరుని, చింతకుంట చెన్నకేశవుని,

దేవునికడప వేంకటేశ్వరుని, నల్లబల్లి చెన్నకేశవుని, నందలూరు సౌమ్య నాథుని, పులివెందల రంగ నాయకుని, పాలగిరి, పెదచెప్పల్లి, పెద్దము డియం, ప్రొద్దుటూరు, పోట్లదుర్తి, మాచనూరు, మాదుపూరు, వత్తలూరు, సంబటూరు, వెలిగోదు, చాగలమర్రులలో నెలకొన్న చెన్నకేశవ స్వామిని,

చిత్తూరుజిల్లాలో తిరుపతి గోవిందరాజుని, హనుమంతుని, శ్రీ రాముని, తిరుమల వేంకటేశ్వరుని, వాయల్పాడు శ్రీరామచంద్రుని;

నెల్లూరు జిల్లాలో ఉదయగిరి శ్రీకృష్ణుని, గండవరం గోపాల కృష్ణుని;

గుంటూరుజిల్లాలో కుఱునూతల చెన్నుని;

కర్ణాటక ప్రాంతంలో మతంగాద్రి హనుమంతుని, విజయ నగరం విఠలుని, శ్రీరామ, శ్రీకృష్ణ, నారసింహులను కీర్తించాడు.

ఇంతేకాక తిరుమల పరిసరాలైన అంజనగిరి, శేషాద్రి, వేంకటాద్రి, గరుడాద్రి, వేదాద్రులను; మరియు భవనాశి, తుంగభద్ర, పుష్కరిణీతీర్థం, భూపతిచెరువు మొదలైన తీర్థాలను తన సంకీర్తనల్లో పేర్కొన్నాడు.

తాళ్లపాక చుట్టూవున్న సోమశిల, గద్దెరాతి, ఎట్టిశిల, దొంగల సాని, గుబ్బలికొండ కనుమలను కూడా ప్రస్తావించాడు. తాళ్లపాక చుట్టూ షట్చక్రాకృతిలో వున్న ఈ కనుమల్లోని ప్రతి కనుమదగ్గర చెన్నకేశ్వరాలయా లున్నాయని స్థానికుల ద్వారా తెలుసుకొన్నట్లు శ్రీగౌరిపెద్ది రామసుబ్బ శర్మగారు అన్నమాచార్య శృంగారసంకీర్తనలు 12వ సంపుటం పీఠికలో చర్చించియున్నారు.

( సంపుటం-12, ద్వితీయ పరిష్కరణ-పీఠిక పుటలు 39-40)

ఈ విధంగా అన్నమయ్య బహుదేశ సంచారంచేసి వివిధ క్షేత్రదైవతా లకు తిరుమల వేంకటేశ్వరస్వామికి అభేదప్రతిపత్తి పాటిస్తూ అనేక కీర్తనలు రచించాడు.

## సంకీర్తనల్లోని ఉత్సవ విశేషాలు :

'ఉత్సూతే సుఖమితి ఉత్సవః' - ఆనందాన్ని అధికంగా కలిగించే దని ఉత్సవాలకు అర్థం. ఉత్ + సవః = ఉత్సవః సాంసారికమైన దుఃఖసాగరాన్ని తరింపచేసేది, మంగళకరమయినది, ఉత్కృష్ట మయినదని ఉత్సవానికి అర్థం.

ఉత్సవాలు రెండు రకాలు. 1. మూలవిగ్రహానికి జరిగేవి 2. ఉత్సవ విగ్రహానికి జరిగేవి. వీటిలోను సామాన్య ఉత్సవాలు, పర్వోత్సవాలనేవి రెండు రకాలు.

వేంకటగిరిమీద స్వామివారికి నిత్యోత్సవాలు, వారోత్సవాలు, పర్వో త్సవాలు వైభవంగా జరుగుతుంటాయి.

నిత్యోత్సవాలలో సుప్రభాతసేవ, తోమాలసేవ, కొలువు, అష్టోత్తరశత సహస్రనామార్చనలు, నివేదనలు, సర్వదర్శనం, ఏకాంతసేవా కైంకర్యాలు చేరుతాయి.

వారోత్సవాలలో బుధవారంనాడు జరిగే సహస్రకలశాభిషేకం, గురు వారంనాడు జరిగే తిరుప్పావడ, శుక్రవారంనాడు జరిగే అభిషేకోత్సవాలకు ప్రాధాన్యం వున్నది.

ఇక పర్వోత్సవాలలో బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, ఉట్ల ఉత్సవం, డోలోత్సవం, రథోత్సవం, కళ్యాణోత్సవం, తెప్పోత్సవం, పుష్పయాగం, దీపా వళి, ఉగాది, శ్రీరామపట్టాభిషేకం, అనంతపద్మనాభ చతుర్దశి, విజయదశమి, కోడై తిరునాళ్, వనభోజనోత్సవం, కౌముదీమహోత్సవాలు సంకీర్తనల్లో పేర్కొనబడ్డాయి.

అన్నమయ్య పదాలు కేవలం భక్తి మార్గాన్ని ప్రబోధించునవే కావు. వీరిపదాల పరిశీలన, పరిశోధనలవల్ల ఆనాటి తిరుమల ఆలయ విశేషాలు, చారిత్రక, రాజకీయ, సామాజిక విశేషాలుకూడ తెలుసుకోవచ్చును.

అన్నమయ్య సాళ్వ నరసింహరాయుల కొలువు వీడి తిరుమల చేరి స్వామివారికి 'శృంగారమంజరి'ని సమర్పించి తదుపరి అచట జరిగే బ్రహ్మోత్సవాలను సేవించేవాడని--

'ప్రతివత్సరంబు తప్పక వృషభాద్రి-
పలికిఁగావించు నా బ్రహ్మోత్సవములు
సేవించుకొనుచు' -

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-42)

అనే పంక్తులవల్ల తెలుస్తోంది. కనుక బ్రహ్మోత్సవాలను గూర్చి పరిశీలిద్దాం.

బ్రహ్మోత్సవం :

తిరుమలలో బ్రహ్మోత్సవం అనాదిగా జరుగుతున్న ఉత్సవ విశేషం. ఈ ఉత్సవాలను బ్రహ్మదేవుడు మొదటిసారిగా జరిపించాడనే అభిప్రాయంతో బ్రహ్మోత్సవాలనే పేరు స్థిరపడినట్లు తెలుస్తోంది. అంతేకాక నవబ్రహ్మలు నవాహ్నికదీక్షతో తిరుమలలో ఉత్సవాలను జరిపించడం, వేంకటేశ్వరుని పరబ్రహ్మ స్వరూపునిగా భావించడం, ఇక్కడ జరిగే ఉత్సవా లన్నింటిలోను బ్రహ్మోత్సవం వైభవంగా జరుపబడే ఉత్సవం కావడంచే 'బ్రహ్మోత్సవాలు' అని పేర్కొనబడుతున్నట్లు వివిధ అభిప్రాయాలు ఏర్పడ్డాయి.

బ్రహ్మోత్సవాలను గూర్చి ఉపనిషత్తుల కాలంనుండి పారమాత్మకోప నిషత్తులోను, వరాహ, పద్మ, భవిష్యత్పురాణాలలోను, ఆగమప్రకీర్ణకాధికారంలోను ప్రస్తావించబడి వుంది.

బ్రహ్మోత్సవాల సంఖ్య :

బ్రహ్మోత్సవాలు నేడు సంవత్సరానికి ఒకసారి, అధికమాసం వచ్చే సంవత్సరాలలో రెండుసార్లు జరుగుతున్నాయి.

కాని చారిత్రకంగాను, అన్నమయ్య పదాల ఆధారంగాను పరిశీలిస్తే బ్రహ్మోత్సవాల సంఖ్యలోను, రోజుల సంఖ్యలోను, ఉత్సవ విశేషాలలోను తేడా కన్పిస్తున్నది.

తిరుమలలో క్రీ.శ. 966 సం॥ నుండి క్రీ.శ. 1606 సం॥ వరకు లభించిన శాసనాలను పరిశీలిస్తే సంవత్సరానికి ఏదో ఒక్క నెలలో తప్ప మిగిలిన 11 నెలల్లోను బ్రహ్మోత్సవాలు జరిగేవని తెలుస్తున్నది.

అన్నమయ్య పదాల ఆధారంగా పరిశీలిస్తే బ్రహ్మోత్సవం సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే జరిగేదని గ్రహించవచ్చును.

వావా భూములవారు వమ్మి శ్రీవేంకటపతి
గావవచ్చి యేటవేట ఘనులయ్యేరు. (సంపు-3-సంకీ-383)

అనే వాక్యాలు ఇందుకు నిదర్శనం.

బ్రహ్మోత్సవాల రోజులసంఖ్య :

తిరుమల శాసనాలను పరిశీలిస్తే బ్రహ్మోత్సవాలు 9 రోజులకు తక్కువగాకుండా 14 రోజులపాటు జరిగేవని తెలుస్తోంది.

అన్నమయ్య పదాలనుబట్టి బ్రహ్మోత్సవాలు 10 రోజులుపాటు నిర్వహింపబడేవని తెలుస్తోంది. బ్రహ్మోత్సవ సమయంలో జరిగే వాహనసేవలను గూర్చి అన్నమయ్య-

తిరువీథుల మెరసీ దేవదేవుడు
గరిమలమించిన సింగారముల తోడను ॥

తిరుదండెలపై వేగీ దేవు(డిదే తొలువాడు
సిరుల రెండవవాడు శేషుని మీద
మురిపేన మూడోవాడు ముత్యాల పందిరి క్రింద
పొరి నాలుగోవాడు పువ్వుగోవిలలోను ॥

గక్కున నయిదవవాడు గరుడిని మీదను
యెక్కెను ఆరవవాడు యేనుగు మీదను
చొక్కమై యేడవవాడు సూర్యప్రభలోనను
యిక్కువ దేరును గుఱ్ఱ మెనిమిదోవాడు ॥

కనకపుటందలము కదిపి తొమ్మిదోవాడు
పెనచి పదోవాడు పెండ్లిపీట
యెనపి శ్రీవేంకటేశుడింతి యలమేల్మంగతో
వనితల నడుమను వాహనాలమీదను (13-192)

అని వర్ణించాడు.

పురాణాలలో, సంకీర్తనల్లో కన్పించే బ్రహ్మోత్సవ వర్ణనల్లో తేడా కన్పిస్తున్నది. అన్నమయ్య సంకీర్తనల్లో వర్ణించిన తిరుదండెలు, ముత్యాల పందిరి, పుష్పగోవిల, కనకపుటందలం నేటి మనుష్యాందోళిక, మౌక్తిక మండపం, కల్పవృక్షం, పల్లకీవాహనాలకు నామాంతరాలుగా కన్పిస్తున్నాయి. పురాణాల్లో చెప్పబడిన హంస, సింహ, సర్వభూపాల, హనుమద్వాహనాల ప్రస్తావన అన్నమయ్య పదాల్లో కన్పించదు.

వాహన సంకీర్తనలు :

వీడుఁగదే శేషుఁడు శ్రీవేంకటాద్రి శేషుఁడు
వేడుక గరుడనితో బెన్నుదైవ శేషుఁడు ॥

(సంపు-3-కీ.365)

గరుడవాహనం :

ఇటు గరుడని నీవెక్కినను
పట పట దిక్కులు పగిలె (1-92)

గజవాహనం :

ఏపున నేనుగునెక్కినిదె దేవుడు (13-58)

ఈ వాహనసంకీర్తనలను బ్రహ్మోత్సవ సమయంలో ఆలపించేవారని భావించవచ్చు.

కల్యాణోత్సవం :

స్వామివారికి జరిగే ప్రధాన ఉత్సవాలలో కల్యాణోత్సవం ఒకటి. స్వామివారి కల్యాణోత్సవానికి సంబంధించి క్రీ.శ. 1546, క్రీ.శ. 1554 సం॥లలో తాళ్ళపాకవారు వేయించిన 2 శాసనాలు కన్పిస్తున్నాయి. ఈ రెండు శాసనాలలోను కల్యాణోత్సవం జరిగే రోజులగురించి, విధానం గురించిన విశేషవివరణలున్నాయి. అన్నమాచార్యుని దౌహిత్రుడైన రేవణూరి వేంకటాచార్యుడు శ్రీపాదరేణుమాహాత్మ్యంలో-

శ్రీలలరంగ మంగమను శ్రీహరికెన్నఁడు ధారవోయుచోఁ
దాళులపాక యన్నమయ దాఁగడిగెం బదముల్ ధరిత్రి మా
తాళుల పాక చిన్నవ పదంబులు పాడిన వాఁడె పర్వరాట్
శైలవిభుండు తత్పదరజంబును మాకు నొసంగఁజెల్లదే.

శకుంతలాపరిణయంలో-

'అమ్మహాదేవుండు మదీయమాతామహవంశ శిఖారత్నంబగు వన్నమాచార్యునకు జామాతరుం డనిపించుకొని, భవదీయ సంకీర్తనంబు లాలించిన కర్ణంబుల నితర సంకీర్తనంబు లాలించనని ప్రతిజ్ఞ గావించె' అని పేర్కొన్నాడు.

పై గ్రంథాధారాలనుబట్టి తాళ్ళపాక వంశీయులే తిరుమలలో కల్యాణోత్సవానికి ప్రధానకారకులని చెప్పవచ్చును.

సంకీర్తనల్లో కల్యాణోత్సవం :

అన్నమయ్య కల్యాణోత్సవ సమయంలో ఆచరించే ఆగమ విధానాలను, ఆచారాలను భక్తితత్త్వంతో కీర్తించాడు.

బ్రహ్మోత్సవ సంకీర్తనలో -

"పెనచి పదోనాడు పెండ్లిపీట" (13-192)

అని పేర్కొనడాన్నిబట్టి కల్యాణోత్సవం బ్రహ్మోత్సవం తర్వాత నిర్వహింపబడేదని తెలుస్తోంది. అన్నమయ్య దివ్యదంపతులైన అలమేల్మంగా శ్రీనివాసుల కల్యాణమహోత్సవాన్ని అనేక సంకీర్తనల్లో వర్ణించాడు. వివాహ సమయంలో కావవచ్చే బాసికాలు కట్టడం, పెండ్లిపీట, తెరకట్టడం, మంగళాష్టకాలు, కంకణ ధారణ, ముహూర్తం, అక్షింతలు, తలంబ్రాలు, కొంగుముళ్లు, సేసలు, విడేలు, చదివింపులు, ఆరతులు, శోభనాలు మొదలైన ఆచారాలన్నింటిని సంకీర్తనల్లో ప్రస్తావించాడు.

అన్నమయ్య తిరుమలలో జరిగే ఉత్సవాలనే కాక తిరుపతి, దేవునికడప, ఒగునూతల, అహోబలం, గండవరం, చిదంబరం, విజయ నగరక్షేత్రాలలో జరిగే ఉత్సవాలను కూడ సంకీర్తనల్లో ప్రస్తావించాడు.

అన్నమయ్య తిరుమలలో జరిగే ఉత్సవాలనే కాక తిరుపతి, దేవునికడప, ఒగునూతల, అహోబలం, గండవరం, చిదంబరం, విజయ నగరక్షేత్రాలలో జరిగే ఉత్సవాలను కూడ సంకీర్తనల్లో పేర్కొన్నాడు.

అన్నమయ్య దేశసంచారంచేస్తూ ప్రసిద్ధదేవాలయాల ఉత్సవ విశేషాలను ముందుతరాల వారికి అందించిన మహనీయుడు.

తాళ్ళపాక వారి కైంకర్యాలు :

తిరుమలలో వేంకటవిభునికి జరిగే సుప్రభాతం, ఏకాంతసేవలలో తాళ్ళపాక వంశస్థులు పాల్గొనే ఆచారం నేటికీ కొనసాగుతోంది. ఏకాంత సేవలో తాళ్ళపాకవారికి స్వామివారి తాంబూలం, ప్రసాదం ఇస్తారు. తిరుమలలో జరిగే కల్యాణోత్సవాలలో తాళ్ళపాకవారు అమ్మవారి పక్షాన కన్యాదాతలుగా వ్యవహరించడం నేటికీ ఆచారంగా వుంది. తిరువీధులలో జరిగే ఉత్సవాలలో కూడా తాళ్ళపాక వారికి ప్రత్యేక మర్యాదలున్నాయి. ఇవేగాక ఉగాది, దీపావళి పర్వదినాల్లో బంగారువాకిలివద్ద జరిగే స్వామివారి కైంకర్యాలలో తాళ్ళపాకవారివి ప్రత్యేక హారతులున్నాయి. ప్రత్యేకించి ఉగాది మొదలు 40 రోజుల పాటు జరిగే నిత్యోత్సవాలలో తాళ్ళపాక వారికి ప్రత్యేక సత్కారాలున్నాయి. ఈ నలభైరోజుల కాలంలో సంకీర్తన భాండాగారంవద్ద హారతిసేవ వున్నది.

అన్నమయ్య కేవలం స్వామివారి ఉత్సవవైభవాలను గూర్చి సంకీర్తనలలో కీర్తించడమే కాక తనవంశంవారి నందరిని ఉత్సవాలలో భాగస్వాములుగా చేసి తరింపచేసిన ధన్యజీవి.

## సంకీర్తన భాండాగారము :

కవుల కృతులను రాగిరేకులమీద వ్రాయించే ఆచారం తెలుగుదేశంలో తాళ్ళపాక కవులకు పూర్వంకాని, తర్వాతకాని లేదు. ఈ పద్ధతికి తాళ్ళపాక వంశజులే ఆద్యులు. భారతదేశంలో కావ్యాలను తామ్రఫలకాలమీద వ్రాయించే సంప్రదాయం ప్రాచీన కాలంలో వున్నట్లు తెలుస్తున్నది. కనిష్కుడు కొన్ని బౌద్ధమత గ్రంథాలను రాగిరేకుల మీద వ్రాయించినట్లు హ్యుయ్యూన్‌త్సాంగ్ పేర్కొన్నాడని, సాయణాచార్యుల వేదభాష్యం కూడా రాగిరేకుల మీదికి ఎక్కినట్లు ఒక ఐతిహ్యం వుందని డి.సి. సర్కార్ పేర్కొన్నారు. (Indian Epigraphy by D.C. Sircar, First Edition 1965, Page-377) లఘుకావ్యాలను శిలలమీద చెక్కించే సంప్రదాయం వుందని, కాంచీపురంలోని కచ్ఛపేశ్వరాలయంలోని ఒక శిలాస్తంభంమీద మయూరుని సూర్యశతకం చెక్కబడి వుందని శ్రీ ఆర్. ఎస్. పంచ ముఖిగారు ఉగ్గడించారు. (4th Annual Congress of Epigraphical Society of India, Jan. 1978, Madras.)

తాళ్లపాకకవుల సాహిత్యాన్ని రాగిరేకులమీద వ్రాయించి తిరుమల ఆలయ ప్రాంగణంలో భద్రపరచిన గదికి 'తాళ్లపాక అర' అని పేరు. తాళ్లపాక అరలోని తాళ్లపాకకవుల సాహిత్యాన్ని గూర్చి మన ప్రాచీనకవు లెవ్వరూ ప్రస్తావించలేదు. మొట్టమొదట ప్రస్తావించినవాడు విదేశీయుడైన ఎ.డి. కాంబెల్. అతడు క్రీ.శ. 1816లో వ్రాసిన మాటలు :

**'Having heard that a number of poems engraved on some thousand sheets of copper had been preserved by the pious care of a family of Brahmins in the temple on the sacred hill at Tirupati, I deputed a native for the purpose of examining them,**

**but with the exception of a treatise on grammar, of which a copy was taken, the whole collection was found to contain nothing but voluminous hymns in praise of the Diety'.**

(Grammar of Telugoo language by A.D. Cambell, First Edition 1816, Madras. )

తిరుమలలో స్వామివారి ఆలయంలో విమానప్రదక్షిణ ప్రాకార మండపాన్ని ఆనుకొని ఉత్తరం వైపున భాష్యకారుల గుడిప్రక్కన సంకీర్తన భాండాగారంలో రాగిరేకులను భద్రపరిచారు. ఇందులో లభించిన రేకుల వివరాలు--

| | |
|---|---|
| తాళ్ళపాక అన్నమయ్య- | 2289 |
| తాళ్ళపాక పెదతిరుమలయ్య- | 205 |
| తాళ్ళపాక చినతిరుమలయ్య- | 37 |
| ఇవికాక సన్న, పెద్దరేకులు- | 170 |
| మొత్తం రేకులు- | 2701 |

సంకీర్తనల్ని రాగిరేకులమీదికి ఎక్కించడం సాధారణ విషయం కాదు. సంకీర్తన భాండాగార వ్యవస్థగూర్చి మొదటగా క్రీ.శ. 1530 నాటి తాళ్ళపాక శాసనంలో కనిపిస్తున్నది.

క్రీ.శ. 1530 నాటి శాసనంలో అచ్యుతరాయుడు బ్రహ్మోత్సవ సమయంలో సంకీర్తన భాండాగారం ముందు నైవేద్య సమర్పణకు ఏర్పాటుచేసినట్లు ప్రస్తావింపబడింది. క్రీ.శ. 1545, క్రీ.శ. 1558 సం॥ నాటి శాసనాలలో కూడా సంకీర్తన భాండాగారంగూర్చిన ప్రస్తావన కనిపిస్తుంది. ఈ సంకీర్తన భాండాగారానికి దీపాలు, నైవేద్యం సమర్పించటం; జీతం, ప్రసాదాలు ఇచ్చి సంకీర్తనలను పాడేవారిని నియమించటం, సంకీర్తనలను వినేవారికి పన్నీరుబుడ్లు, చందనతాంబూలాదులు ఇవ్వటంగూర్చి కలదు.

నిత్యం తిరుమంజన సమయంలోను, బ్రహ్మోత్సవం, రథోత్సవసమయాల్లోను ఈ సంకీర్తనలు ఆలపించే పద్ధతిని ఏర్పాటుచేశారు. గ్రీష్మోత్సవంలో 'సంకీర్తనలు అరుళుప్పాడు' ఏర్పరచారు. (అరుళుప్పాడు అనగా దయ వర్షించి పాడే పాటలతో కూడిన ఉత్సవం) తిరుపతిలో గోవిందరాజస్వామి ఆలయంలోకూడా సంకీర్తనల గానానికి ఏర్పాట్లు చేశారు.

ఈ సంకీర్తన భాండాగారం ద్వారానికి ఇరువైపుల అన్నమయ్య, పెద తిరుమలయ్యల శిల్పమూర్తు లున్నాయి.

సంకీర్తన ప్రక్రియకు, ఇతర రచనలకు శాశ్వతస్థితి కల్పించడానికై 'తాళ్ళపాక అర' ను ఏర్పాటుచేసి కైంకర్యాదులు నిర్వహించడంపట్ల తాళ్లపాకవారు జరిపినకృషి 'నభూతో నభవిష్యతి'.

కీ.శే. సాధు సుబ్రహ్మణ్య శాస్త్రిగారు సంకీర్తన భాండాగారం నుండి సంకీర్తనల రాగిరేకులను మొట్టమొదటగా క్రీ.శ. 1922 సంవత్సరములో సేకరించి వ్రాతప్రతులను సిద్ధంచేశారు. తాళ్లపాకకవుల జీవితవిశేషాలను, కృతులను, భగవత్ కైంకర్యాలను శాసనస్థ ఆధారాలతో నిరూపించారు.

తాళ్ళపాక సంకీర్తనల పరిష్కరణ - ముద్రణ :

తాళ్లపాక వాఙ్మయాన్ని పండిత వి. విజయరాఘవాచార్య, వేటూరి ప్రభాకరశాస్త్రి, ఏ.వి. శ్రీనివాసాచార్యులు, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, పి.టి. జగన్నాథరావు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, కామిశెట్టి శ్రీనివాసులు గారలు పరిష్కరించారు.

తాళ్ళపాకసాహిత్యాన్ని తిరుమల తిరుపతి దేవస్థానంవారు క్రీ.శ. 1935 సంవత్సరంనుండి ప్రకటిస్తున్నారు. క్రీ.శ. 1935 సంవత్సరంలో తాళ్ళపాక లఘుకృతులు మొదటి సంపుటంగా (Minor works of Tallapaka poets), 1936-1937 సంవత్సరములలో అన్నమాచార్య, పెదతిరుమలాచార్య సంకీర్తనలు 2,3 సంపుటాలుగా ముద్రింపబడ్డాయి. 1947 సం॥ నుండి అన్నమాచార్య సంకీర్తనలు పరిష్కరణ సంవిధానంతో సంపుటాలుగా ప్రకటింపబడుతున్నాయి. 1947 సం॥లో ప్రకటింపబడిన 4వ సంపుటం

మొదలుకొని 1992 సంవత్సరంవరకు తాళ్ళపాకవారి సంకీర్తనలు 32 సంపుటాలుగా వెలువడ్డాయి. ఇందులో 16వ సంపుటం చినతిరుమలయ్యది; 21, 23 సంపుటాలు పెదతిరుమలయ్యవి. అవిసోను 4వ సంపుటం నుండి 32వ సంపుటం వరకు అన్నమయ్యవి. వీటిలో 5 నుండి 11వ సంపుటం వరకు అధ్యాత్మ సంకీర్తనలు. 4వ సంపుటము మరియు 12వ సంపుటంనుండి 32వ సంపుటం వరకు శృంగార సంకీర్తనలు. మొత్తం అన్నమయ్యవి అధ్యాత్మ, శృంగారసంకీర్తనలు కలసి 26 సంపుటాలుగా వెలువడినట్లు లెక్క. ఇక 3 సంపుటాలు ముద్రింపవలసి వున్నది. అన్నమయ్య--

పారపవేత్రుపై పంకీర్తనములు
పరపత్వమువఁదాళ పముఖముల్ గాఁగ
పరమ తంత్రములు ముప్పది రెండువేలు -

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-45)

రచించినట్లు ద్విపద ఆధారంగా తెలుస్తున్నది. కాని రేకులద్వారా మనకు లభించిన కీర్తనలు దాదాపు 14,000. మిగిలిన సంకీర్తనలు కాలగర్భంలో కలసిపోయాయి.

## తాళ్ళపాక వంశస్థులు :

పిరివరు మెప్పించి చెలఁగి యాదేవు-
వరమునఁదనయుంత వారిఁబుత్రకుల
నరప యాచార్యు నున్నత యశోధనువి,
తిరుమలాచార్యుని ధీవిశారదువి
గాంచి, వారును దన కరణి విద్యలను
గాంచనాంబరు భక్తికలిమిఁబెంపొంద
శౌరికథాసుధా పల్లాప గరిమ
ధారుణి నెంతయుఁదనరారు చుండె.

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-46)

తాళ్ళపాక వంశఖ్యాతికి మూలపురుషుడు అన్నమయ్య. అన్నమయ్య సతీమణి, పుత్రపౌత్రాదులుకూడా కవులుగా, సంకీర్తనాచార్యులుగా ఆంధ్ర సాహిత్యచరిత్రలో సుస్థిరస్థానం సంపాదించుకొన్నవారే!

## తాళ్లపాక తిమ్మక్క :

ఈమె అన్నమయ్య మొదటిభార్య. 'సుభద్రాకళ్యాణము' అనే గేయ కావ్యాన్ని రచించినది. తొలి తెలుగు కవయిత్రి. మంజరీ ద్విపదకావ్యమైన సుభద్రాకళ్యాణం స్త్రీజనోపయుక్తమైన మధుర గేయ రచన. ఈకావ్యం 1947 సంగలో దేవస్థానంవారిచే ప్రకటింపబడినది.

## తాళ్లపాక నరసింగన్న :

ఇతడు అన్నమయ్య పెద్దకుమారుడు. వీరి కృతులు అలభ్యం. 'కవి కర్ణరసాయనకర్త' వీరేనని పరిశోధకుల అభిప్రాయం.

## తాళ్లపాక పెదతిరుమలయ్య :

ఇతడు అన్నమాచార్యుని ద్వితీయ పుత్రుడు. శ్రీమద్వేదమార్గ ప్రతి ష్ఠాపనాచార్య, వేదాంతాచార్య, కవితార్కికకేసరి ఇత్యాది బిరుదాంకితుడు. వీరి సాహిత్యం మొత్తం 205 రేకుల్లో లభించినది.

రచనల వివరాలు :

| | | |
|---|---|---|
| అధ్యాత్మ సంకీర్తనలు | -- | 76 రేకులు |
| శృంగార సంకీర్తనలు | -- | 89 రేకులు |
| నీతి (సీసపద్య) శతకము | -- | 10 రేకులు |
| చక్రవాళ మంజరి | -- | 2 రేకులు |
| సుదర్శన రగడ | -- | 1 రేకులు |
| శృంగార దండకము | -- | 3 రేకులు |

రేఫ ఱ కారన్నిర్ణయము -- 4 రేకులు

వేంకటేశ్వరోదాహరణము -- 3 రేకులు

వృత్తపద్యశతకము -- 7 రేకులు

వైరాగ్య వచన మాలికా గీతములు -- 10 రేకులు

భగవద్గీత (తెలుగువచనము) ఎస్. వి. యూనివర్శిటి వారిచే 1978 సం॥లో ప్రచురింపబడినది.

హరివంశము అలభ్యం

(చిన్నన్న అష్టమహిషీ కళ్యాణంలో పేర్కొన్నాడు)

సంకీర్తన లక్షణవ్యాఖ్య అలభ్యం.

శ్రీవేంకటేశ్వర ప్రభాతస్తవము : 1945 సం॥లో ప్రకటితమైన వేంకటేశ్వర వచనములతో ఇదిప్రచురితమైనది.

## తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు :

ఇతడు తాళ్ళపాక పెదతిరుమలయ్య పెద్ద కుమారుడు. వీరి సాహిత్యం 37 రేకులలో లభించినది. అష్టభాషాచక్రవర్తి బిరుదాంకితుడు.

శృంగార సంకీర్తనలు - 20 రేకులు 1962 సం॥లో ప్రకటితం.

అధ్యాత్మ సంకీర్తనలు - 10 రేకులు 1962 సం॥లో ప్రకటితం.

అష్టభాషాదండకము - 3 రేకులు 1935 సం॥లో ప్రకటితం.

సంకీర్తన లక్షణము - 4 రేకులు 1935 సం॥లో ప్రకటితం.

## తాళ్ళపాక అన్నయ్య :

పెదతిరుమలాచార్యుని రెండవ కుమారుడు. ఈతఁ'డన్ని విద్యల యందు నరయ మున్నింటి యన్నయార్యునిఁబోలు నన్నయాచార్యుఁడ'ని కీర్తిని పొందాడు. మతప్రచారంకోసం గుంటూరుకు తరలి వెళ్ళినట్లు శాసనాలద్వారా తెలుస్తున్నది.

## తాళ్ళపాక పెదతిరువెంగళనాథుడు :

సంగీత సత్కవిత్వాధికుడు. ఇతడు స్వామిసన్నిధిలో కీర్తనలు పాడు చుండగా స్వామి ఆడుచుండెడివాడట. రేవణూరి వేంకటాచార్యుఁడు శకుంతలా పరిణయములో 'విశేషించియు నత్తిరువెంగళ నాథుండు సంకీర్తనంబులు పాడిన నాడం దొడంగె' నని ప్రస్తావించాడు.

## తాళ్ళపాక చినతిరువేంగళనాథుడు (చిన్నన్న) :

ఈయన పెదతిరుమలయ్య నాల్గవ కుమారుడు.

వీరి రచనలు-

అన్నమాచార్య చరిత్ర-ద్విపదకావ్యము - 1949 సం॥లో ప్రకటితం.
-1978సం॥లో ద్వితీయ ముద్రణ

పరమయోగి విలాసము - ద్విపదకావ్యము - 1938సం॥లో ప్రకటితం.

అష్టమహిషీ కల్యాణం - ద్విపదకావ్యము - 1937సం॥లో ప్రకటితం.

ఉషాకల్యాణము - ద్విపదకావ్యము - 1938సం॥లో ప్రకటితం.

## కోనేటి తిరువెంగళనాథుడు :

పెదతిరుమలాచార్యుని చిన్న కుమారుడు. శ్రీవైష్ణవాచార్యుడని, వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్యుడని కీర్తిని పొందినాడు.

## తాళ్ళపాక తిరువేంకటాచార్యుఁడు (తిరువేంగళప్ప) :

ఈయన చినతిరుమలాచార్యుని కుమారుడు. వీరి రచనలు - అమరుకము, గురుబాలప్రబోధిక, సుధానిధి.

## రేవణూరి వేంకటాచార్యుడు :

అన్నమాచార్యుని దౌహిత్రుడు. వీరి రచనలు - శకుంతలా పరిణయము, శ్రీపాద రేణుమాహాత్మ్యము మొదలగునవి.

అన్నమయ్య మొదలుకొని ఐదుతరాలవరకు అంటే ఒకటిన్నర శతాబ్దికాలం అవిచ్ఛిన్నంగా వివిధప్రక్రియల్లో అనేక గ్రంథాలను రచించి తెలుగుభాషా సాహిత్యాలకు ఎనలేని సేవ చేసినవారు తాళ్ళపాకకవులు.

"తాళ్ళపాకవారి సాహితీ మందిరమునకు మతము పునాది. సంస్కృతాంధ్రములు కట్టడపు శిలలు. సంకీర్తనాది సాహితీ ప్రక్రియలు సోపానములు. అందలి యారాధ్య దైవము శ్రీవేంకటేశ్వర స్వామి. ధర్మార్థ కామమోక్షములు నాలుగు ప్రాకారములు. మధుర కవితలు ద్వారంవాకిళ్ళు. సార్వజనీనము, సార్వకాలికమునగు ఉత్తమ భావసంపద తన్మందిరశ్రీభండారము. ఆ కవులే యర్చకులు. భక్తియే భగవత్ప్రసాదము. గానమే స్వామి కంగరంగ భోగములు. రసిక వర్యులే యాత్రికులు. ఇదియే వారి కవితా స్వరూపము" అన్న డా॥ వేటూరి ఆనందమూర్తిగారి మాటలు చిరస్మరణీయాలు.

## అవతార సమాప్తి :

అన్నమాచార్యులు క్రీ.శ. 1503లో దివ్యధామం అలంకరించాడు. అది దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశి.

అన్నమయ్యను వారి వంశస్థు లందరు గురువుగా, దైవంగా భావించి పూజించారు. అన్నమయ్య వల్లనే తాము పునీతులమైనామని చాటిన కీర్తనలు తాళ్ళపాకవారి సంకీర్తనల్లో కన్పిస్తాయి. తి.తి. దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టువారు ప్రతినెల 'బహుళద్వాదశి', ప్రతిసంవత్సరం ఫాల్గుణ బహుళ ద్వాదశినాడు వర్ధంతి ఉత్సవములు జరపడం ఆనవాయితీగా వున్నది. అన్నమయ్య నిర్యాణతిథిని పురస్కరించుకొని తాళ్లపాకవారు రచించిన కీర్తన-

దినము ద్వాదశి నేఁడు తీర్థదినము నీకు
జనకుఁడ అన్నమాచార్యుఁడ విచ్చేయవే॥
అనంతగరుడముఖ్యులైన సూరిజనులతో
ఘననారదాది భాగవతులతో

దనుజ మర్దనుఁడైన దైవశిఖామణితోడ
వెనుకొని యారగించ విచ్చేయవే॥

వైకుంఠాన నుండి యాళువారలలోపల నుండి
లోకపు నిత్యముక్తులలోన నుండి
శ్రీకాంతతోడ నున్న శ్రీవేంకటేశుఁగూడి
యీకడ నారగించ నింటికి విచ్చేయవే॥

సంకీర్తనముతోడ సనకాదులెల్లఁబాడ
పొంకపు శ్రీవేంకటాద్రి భూమి నుండి
బింకెఁ శ్రీవేంకటగిరి లక్ష్మీవిభుఁడు నీవు
వంకెల మాయింటి విందు లారగించవే ॥

(2-151)

అన్నమయ్యను హరియవతారమని, అప్పని వరప్రసాదియని అన్నమయ్య పుత్రపౌత్రులు కీర్తించారు.

హరి యవతార మీతఁడు అన్నమయ్య
అరయ మా గురుఁడీతఁడన్నమయ్య ॥

వైకుంఠనాథుని వద్ద పడిఁబాడుచున్న వాఁడు
ఆకరమై తాళ్ళపాక అన్నమయ్య
ఆకసపు విష్ణుపాదమందు నిత్యమై వున్నవాఁడు
ఆక డీకడఁదాళ్ళపాక అన్నమయ్య ॥

క్షీరాబ్ధిశాయి నిట్టే సేవింపుచునున్నవాఁడు
ఆరితేరి తాళ్ళపాక అన్నమయ్య
ధీరుడై సూర్యమండల తేజమువద్ద నున్నవాఁడు
ఆరితేరి తాళ్ళపాక అన్నమయ్య ॥

యీవల సంసారలీల యిందిరేశుతో నున్నవాఁడు
ఆవటించి తాళ్ళపాక అన్నమయ్య
భావింప శ్రీవేంకటేశు పాదములందె వున్నవాఁడు
హేవ భావమై తాళ్ళపాక అన్నమయ్య ॥ (2-100)

అప్పని వరప్రసాది అన్నమయ్య
అప్పసము మాకె కలడన్న మయ్యా ॥

అంతటికి వేలితైన ఆదినారాయణుఁడన
యంతరంగాన నిలిపీ నన్నమయ్యా
సంతసానఁజెలువొందె సనక సనందనాదు
లంతటివాఁడు తాళ్ళపాకన్నమయ్యా ॥

బిరుదు టెక్కెములుగాఁబెక్కు సంకీర్తనములు
హరిమీఁద విన్నవించె నన్నమయ్యా
విరివి గలిగినట్టి వేదముల యర్థమెల్ల
అరసి తెలిపినాఁడు అన్నమయ్యా ॥

అందమైన రామానుజార్య మతమును
అందుకొని నిలిచినాఁడన్నమయ్యా
విందువలె మాకును శ్రీవేంకటనాథుని నిచ్చె
అందరిలోఁదాళ్ళపాక అన్నమయ్యా ॥

(16-1-23)

శరణంటి మాతని సమ్మంధమునఁజేసి
మరిగించి మమునేలి మన్నించవే ॥

సకలవేదములు సంకీర్తనలు చేసి
ప్రకటించి వినుఁబాడి పావనుఁడైన
అకలంకుఁడు తాళ్ళపాకన్నమాచార్యుల
వెకలిమై యేలిన శ్రీవేంకటనిలయ ॥

నారదాది సనకసనందనాదులవలె
పేరుపడి విన్నుఁబాడి పెద్దలైనట్టి
ఆ రీతిఁదాళ్ళపాకన్నమాచార్యుల
చేరి యేలినయట్టి శ్రీవేంకటనిలయ ॥

సామవేద సామగానసప్తస్వరములను
బాముతో నీసతి విన్నఁబాడిన యట్టి
ఆముకొన్న తాళ్ళపాకన్నమాచార్యుల
వేమరు మెచ్చిన శ్రీవేంకటనిలయా ॥

(2-24)

ఇవి అన్నమాచార్యుల సంబంధముతో గొప్పవారమైనామని చెప్పుకొన్న సంకీర్తనలు.

సంగీతసాహిత్యముల మేలుకలయికతో శ్రీవైష్ణవమత ప్రచారానికి, ఆంధ్రసారస్వత సేవకు తాళ్ళపాక అన్నమయ్య గావించిన సేవ ఎనలేనిది.

..... ..... ..... తిరువేంగళనాథ
విరచిత సద్భక్త విభవాన్నమాచార్య
చరితంబు జగదేక సన్నుతం బగుచు
నాచక్ర శంఖాంక యశముతోఁగూడ
నాచంద్రతారార్కమై యుండుఁగాక.

(అన్న. చరిత్ర.ద్విపద-పుట-47)

అన్న చిన్నన్న వాక్యాలే చిరస్మరణీయాలు.

* * * * *

# ఉపయుక్త గ్రంథసూచి


1. అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి (పరిష్కర్తలు)
   అధ్యాత్మ సంకీర్తనలు
   అన్నమాచార్య విరచితములు
   సంపుటములు 10, 11
   తి.తి. దేవస్థాన ప్రచురణలు

2. అనంతకృష్ణశర్మ, రాళ్లపల్లి (పరిష్కర్త)
   శృంగార సంకీర్తనలు
   అన్నమాచార్య విరచితములు
   సంపుటములు 13, 14
   తి.తి. దేవస్థాన ప్రచురణలు.

3. అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి
   రామసుబ్బశర్మ, గౌరిపెద్ది (పరిష్కర్తలు)-
   శృంగార సంకీర్తనలు
   అన్నమాచార్య విరచితములు
   సంపుటములు 19, 20, 22
   తి.తి. దేవస్థాన ప్రచురణలు.

4. ఆనందమూర్తి, వేటూరి
   తాళ్లపాకకవుల కృతులు-
   వివిధ సాహితీ ప్రక్రియలు
   ప్రభాకర ప్రచురణలు
   హైదరాబాదు, 1974.

5. ఆనందమూర్తి, వేటూరి
   తాళ్లపాక కవుల పదకవితలు-
   భాషాప్రయోగవిశేషాలు

ప్రభాకర ప్రచురణలు
హైదరాబాదు, 1976

6. కొండమాచార్యులు, ముదివర్తి

అమృతసారము
త్యాగరాజ ప్రింటర్స్, తిరుపతి, 1986.

7. గంగప్ప, ఎస్.

తెలుగులో పదకవిత
శశీప్రచురణలు
శ్రీనివాసనగర్, గుంటూరు, 1983.

8. గోవిందరాజు, చిట్రాజు

తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనలలో-
ఉత్సవవిశేషాలు
శ్రీనివాస ప్రచురణలు
రామసముద్రం, 1987.

9. తులజ, పుట్టపర్తి

శ్రీరామానుజుల జీవితచరిత్ర
కాచిగూడ, హైదరాబాదు, 1984.

10. నాగభూషణం, రాంపల్లి

తిరుపతిక్షేత్ర సాహిత్యసమీక్ష
పవన్‌కుమార్ ప్రచురణలు
తిరుపతి, 1983.

11. పార్థసారథి భట్టాచార్యులు, ఎ.

వరాహపురాణం
ఎస్.వి. ప్రాచ్య పరిశోధనాలయ సంస్థ
తి.తి.దేవస్థానములు, 1956.

12. పెదతిరుమలయ్య, తాళ్లపాక

శ్రీమద్భగవద్గీత
ఎస్. వి. విశ్వవిద్యాలయ
ప్రాచ్యపరిశోధనాలయం
తిరుపతి, 1978.

13. ప్రభాకరశాస్త్రి, వేటూరి (పరిష్కర్త)

శృంగారసంకీర్తనలు సంపు-4
అధ్యాత్మసంకీర్తనలు సంపు-5
అన్నమాచార్య విరచితములు
తి.తి.దేవస్థాన ప్రచురణలు, 1947, 1950.

14. ప్రభాకరశాస్త్రి, వేటూరి (పరిష్కర్త)

అన్నమాచార్య చరిత్రము
ప్రథమముద్రణ
తి.తి.దేవస్థాన ప్రచురణ, 1949.

15. బాలసుబ్రహ్మణ్యం, జూలకంటి

వేంకటేశ్వరుడు-అన్నమయ్య
చంద్రమౌళి ప్రింటర్స్,
తిరుపతి, 1983.

16. మోహన్, జి. ఎస్.

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధపుణ్యక్షేత్రాలు-
దేవాలయాలు
శ్రీనివాస ప్రచురణలు
కళ్యాణదుర్గం, 1985.

17. రజనీకాంతరావు, బాలాంత్రపు

ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజయవాడ, 1975.

18. రామసుబ్బశర్మ, గౌరిపెద్ది (పరిష్కర్త)

శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల
జీవితచరిత్రము
మూడవముద్రణ
తి.తి.దేవస్థాన ప్రచురణ, 1978.

19. రామసుబ్బశర్మ, గౌరిపెద్ది (పరిష్కర్త)

అధ్యాత్మ సంకీర్తనలు
అన్నమాచార్య విరచితములు
సంపుటములు 1, 2, 3
తి.తి. దేవస్థానముల ప్రచురణ.

20. రామసుబ్బశర్మ, గౌరిపెద్ది (పరిష్కర్త)

శృంగారసంకీర్తనలు
అన్నమాచార్య విరచితములు
సంపు. 12, 24, 25, 26, 27, 28,
29, 30, 31
తి.తి. దేవస్థాన ప్రచురణలు.

21. రాఘవయ్య, తిరువాయిపాటి

ఆళ్వారుల దివ్యవైభవము
తి.తి. దేవస్థాన ప్రచురణ, 1980.

22. రాఘవేంద్రస్వామి యాజర్య

కర్ణాటక హరిదాస సాహిత్య
కన్నడ సాహిత్యపరిషత్తు
ధార్వాడ, 1952.

23. లక్ష్మణయ్య, సముద్రాల

అన్నమాచార్య సంకీర్తనామృతము
ప్రథమ, ద్వితీయ భాగములు
ఫ్రీడమ్ ప్రెస్, మద్రాసు
1982, 1983.

24. లీలావతి, పొన్నా

అన్నమాచార్య సంకీర్తనల్లోవి-
జానపదగేయఫణితులు,
పొన్నాపబ్లికేషన్స్, 1986.

25. వాణి, కేసర్ల

అన్నమయ్య అంతరంగంలో-
అలమేల్మంగ
తి.తి.దేవస్థాన ప్రచురణ, 1986.

26. విజయరాఘవాచార్యులు, టి.

ఆదినారాయణనాయుడు జి.
(పరిష్కర్తలు)
తాళ్లపాక లఘుకృతులు
తి.తి.దేవస్థానప్రచురణ
మద్రాసు - 1935.

27. వేంకటరామానుజస్వామి, పరవస్తు

శ్రీవేంకటాచలమాహాత్మ్యము
తి.తి.దేవస్థానప్రచురణ, 1976.

28. శ్రీనివాసాచార్యులు, ఏ.వి. (పరిష్కర్త)

అధ్యాత్మ సంకీర్తనలు
అన్నమాచార్యవిరచితములు సంపు-6, 16
శృంగారసంకీర్తనలు సంపు-15,16,17
తి.తి. దేవస్థానప్రచురణ.

29. శ్రీనివాసులుశెట్టి, కామిశెట్టి (సంపాదకులు)

తాళ్ళపాక అన్నమయ్యపాటలు
తి.తి. దేవస్థానప్రచురణ, 1976.

30. శ్రీనివాసులు శెట్టి, కామిశెట్టి

అన్నమాచార్యులు
శ్రీనివాస బాలభారతి
తి.తి.దేవస్థాన ప్రచురణ, 1982.

31. శ్రీనివాసులుశెట్టి, కామిశెట్టి (సంపాదకులు)

తాళ్ళపాక అన్నమాచార్యుల
జయంతి సంచిక
తి.తి.దేవస్థానములు, 1978.

32. సర్వోత్తమరావు, కె

అన్నమయ్య - శ్రీపాదరాయలు
అన్నమయ్య - పురందరదాసు
పారిజాత ప్రచురణలు
తిరుపతి, 1982.

33. సీతారామమ్మ, ఓరుగంటి

తాళ్ళపాక పెదతిరుమలయ్య
కృతుల పవిమర్శక పరిశీలన
సుభద్రాగ్రంథమాల
తిరుపతి, 1985.

ENGLISH :

1. Vijaya Raghavacharya, V.

Inscriptions Vol-VI, P-I-
T.T.Devasthanams, 1937.

2. Vijaya Raghavacharya, T.K.T.

History of Tirupati, Vol. II
T.T.Devasthanams, 1979.

3. Surya Kumari, A.

The Temples in Andhra Desa
Sarvodaya Illakkiya
Pennai, Madhurai, 1982.

T.T.D. Religious Publications Series No.:372

Price : Rs. 10/-

Printed and Published by Sri M.K.R. Vinayak, I.A.S., Executive Officer,
T.T. Devasthanams and Printed at T.T.D. Press, Tirupati.